thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 148 | జగిత్యాల మంగళవారం 01 సెప్టెంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

**మంధాన మరో మైలురాయి..**




11



## జాతీయ జెండాను అవమానిస్తే మూల్యం తప్పదు

ఖలిస్థానీ వేర్పాటువాదులకు కిరణ్ రిజిజు హెచ్చరిక

.. వివరాలు 4లో

## బాణాసంచా కర్మాగారంలో పేలుడు

- పేలుడు ధాటికి 11 మంది దుర్మరణం
- యూపి సీఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి




4

## మోదీ-పుతిన్ కీలక భేటీ

- వాణిజ్యం నుంచి రక్షణ వరకు విస్తృత చర్చలు
- ఎస్‌సీవో సదస్సు వేదికగా ఇరువురు నేతల సమావేశం
- ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తోనూ భేటీ

4



# పదేళ్లలో అప్పులే తప్ప అభివృద్ధి ఏదీ?



### అప్పును నెత్తిన పెట్టిన కేసీఆర్

### 8.11 లక్షల కోట్లకు 90వేల కోట్లు వడ్డీల చెల్లింపు

### మూసారాం బాగ్ బ్రిడ్జిని కూడా నిర్మించలేదు

### తాము అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పరుగులు

### అంబర్‌పేటలో పదెకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు

### అంబర్‌పేట సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ రూ.8.11 లక్షల కోట్ల అప్పులతో తెలంగాణను దివాలా తీయించారని, కేవలం వడ్డీల రూపంలోనే ఏడాదికి రూ.90 వేల కోట్లు చెల్లించాల్సిన దుస్థితి తీసుకొచ్చారని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. మాతృభాషా దినోత్సవాల క్రమంలో మూసీ నదిపై నూతనంగా నిర్మించిన ముసారాంబాగ్ వంతెనను సోమవారం ప్రారంభించిన అనంతరం అంబర్‌పేటలో జరిగిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. 60 ఏళ్లలో 16 మంది ముఖ్యమంత్రులు కలిసి చేసిన అప్పు రూ.70 వేల కోట్లు ఉంటే, కేసీఆర్ ఒక్కరే తొమ్మిదేళ్లలో దానిని రూ.8.11 లక్షల కోట్లకు పెంచేశారని ఆరోపించారు. వర్షం వస్తే మునిగిపోయే ముసారాంబాగ్ బ్రిడ్జిని పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ఎందుకు కట్టలేకపోయిందని సీఎం ప్రశ్నించారు. ఊరి బయట డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కడితే పేదలకు ఉపయోగపడవని, అందుకే అంబర్‌పేటలోనే 10 ఎకరాల స్థలంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. చెరువులను కబ్జాల నుంచి కాపాడుతున్న 'హైడ్రా'పై ప్రతిపక్షాలు కావాలనే బురద చల్లుతున్నాయని మండిపడ్డారు.

*- హైదరాబాద్, ఆగస్టు 31*



# 'ఇన్వెస్ట్ తెలంగాణ'కు గ్లోబల్ టచ్

### డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో సమ్మిట్ ■ ప్రజాభవన్‌లో ప్రత్యేక వార్‌రూమ్

### సీనియర్ అధికారులతో కమిటీలు ■ ఢిల్లీలో కర్టెన్ రైజర్‌కు సన్నాహాలు

### ఏర్పాట్లపై రోజువారీ నివేదికకు భట్టి ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు 31:** 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సమ్మిట్ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రతి అంశాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించడంతో పాటు అవసరమైన నిర్ణయాలను వేగంగా తీసుకునేందుకు ప్రజాభవన్‌లో ప్రత్యేక వార్‌రూమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సోమవారం ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సబ్ కమిటీ సభ్యుడు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు. సమ్మిట్‌కు సంబంధించిన ఏర్పాట్ల పురోగతిని రోజువారీగా పర్యవేక్షించేందుకు ప్రజాభవన్‌లో ప్రత్యేక వార్‌రూమ్ ఏర్పాటు

మిగతా 2 లో

## కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలి



- వెయ్యి రోజుల్లో రూ.1.24 కోట్ల జీతభత్యాలు
- ప్రజల కోసం ఒక్కసారైనా బయటకు వచ్చారా?
- ఆరు రోజులపాటు ఆందోళనలకు సీఎం పిలుపు
- పదేళ్ల పాలనపై అసెంబ్లీలో చర్చకు సవాల్

2

ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. వెయ్యి రోజులుగా ప్రజల కోసం బయటకు రాని కేసీఆర్.. ఈ కాలంలో రూ.కోటికి పైగా జీతభత్యాలు తీసుకున్నారని ఆరోపించారు.

## నర్సుపై అఘాయిత్యం.. ఆపై హత్య!




- తుక్కుగూడ కేసులో నిందితుడి అరెస్ట్
- అత్యాచారం జరిగినట్లు పోస్టుమార్టం నివేదిక
- సీసీటీవీ ఆధారాలతో సనావుల్లా గుర్తింపు

తుక్కుగూడలో నర్సు హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. యువతిపై అత్యాచారం జరిగినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. కేసులో ప్రధాన నిందితుడిగా అనుమానిస్తున్న బిహార్‌కు చెందిన సనావుల్లా ఖాన్‌ను అరెస్ట్ చేశారు.

2

## నగరంలో మూడు విషాదాలు

- ప్రేమ వ్యవహారంతో కానిస్టేబుల్ ఆత్మహత్య
- మనస్తాపంతో పదో తరగతి విద్యార్థి..
- చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీ..
- మూడు ఘటనలపై పోలీసుల దర్యాప్తు




2



కృష్ణా జలాలు తరలిపోతుంటే

## చోద్యమా?

- వెలిగొండపై హరీశ్‌రావు ఆగ్రహం
- తెలంగాణకు తీరని ద్రోహమని విమర్శ

### ఆడబిడ్డల భద్రత ప్రశ్నార్థకం!

3

## ధరణి కన్నా దరిద్రంగా 'భూభారతి'!

- 22ఏతో 50 లక్షల మందికి ఇబ్బందులు: బీజేపీ
- నిషేధిత జాబితాపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- స్వతంత్ర సంస్థతో విచారణకు రామచందర్‌రావు డిమాండ్
- సెప్టెంబర్ 7లోగా పరిష్కరించకుంటే అసెంబ్లీ ముట్టడి: రఘునందన్

2





## తెలంగాణ కోసం కష్టపడ్డ నన్నే గెంటేశారు!

- ప్రశాంత్‌రెడ్డి 'శకుని' పాత్ర పోషించారు
- జీవితంలో ఆయనను మాత్రం క్షమించను
- నిజామాబాద్ పాంచజన్య సభలో కవిత భావోద్వేగం
- కేసీఆర్‌తో తనను విడదీశారని తీవ్ర ఆరోపణ
- కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నించారని విమర్శ

3



# ‘ఇన్వెస్ట్ తెలంగాణ’కు గ్లోబల్ టచ్

మొదటి పేజీ తరువాయి

చేయాలని భట్టి ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడంతో పాటు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా వార్‌రూమ్ పని చేయాలని సూచించారు. సమ్మిట్ నిర్వహణకు అడ్వైజరీ, ఎగ్జిక్యూటివ్, ఇన్విటేషన్, హాస్పిటాలిటీ, ప్రోగ్రామ్ డిజైనింగ్, మీడియా-కాంటాక్ట్ అండ్ కమ్యూనికేషన్, ఎంఓయూ తదితర కమిటీలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతి కమిటీకి సీనియర్ ఐఏఎస్ అధికారులను బాధ్యులుగా నియమించాలని ఆదేశించారు. అడ్వైజరీ, ఎగ్జిక్యూటివ్ కమిటీలను వీలైనంత త్వరగా ఏర్పాటు చేసి కార్యాచరణపై సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు తెలంగాణలోని అవకాశాలను సమర్థంగా వివరించేలా సమ్మిట్‌ను రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రధానంగా ప్రదర్శించాలన్నారు. సమ్మిట్‌కు ప్రత్యేక లోగోను రూపొందించాలని ఆదేశించారు. సమ్మిట్‌కు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృత ప్రచారం కల్పించాలని భట్టి సూచించారు. ఇందులో భాగంగా అక్టోబర్ మొదటి లేదా రెండో వారంలో ఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. విదేశీ దౌత్యవేత్తలు, కేంద్ర మంత్రులు, దేశంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న తెలంగాణ అధికారులు, ఇతర ప్రముఖులను ఆహ్వానించేలా ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సామాజిక మాధ్యమాల్లో సమ్మిట్‌పై విస్తృత ప్రచారం చేపట్టడంతో పాటు హైదరాబాద్‌లోని ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో హోర్డింగులు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని శాఖలను సమన్వయం చేస్తూ ఏర్పాట్లపై రోజువారీ పురోగతి నివేదికను తనకు అందించాలని ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్‌ను భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రతి కమిటీకి అప్పగించిన బాధ్యతలు, వాటి అమలు, పెండింగ్ అంశాలు, తదుపరి చేపట్టాల్సిన చర్యలను నివేదికలో పొందుపరచాలన్నారు. తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా పరిచయం చేసేలా ‘ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026’ను నిర్వహించాలని, ఇందుకోసం ప్రభుత్వంలోని అన్ని శాఖలు ఒకే లక్ష్యంతో పనిచేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సమావేశంలో ఎనర్జీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఫ్యూచర్ సిటీ సీఎండీ శశాంక, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి.పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ విఫలమై కానిస్టేబుల్ ఆత్మహత్య



**హైదరాబాద్, ఆగస్ట్ 31:** హైదరాబాద్‌లో దారుణం జరిగింది. అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఏఆర్ కానిస్టేబుల్ నిభాష్ ఆత్మహత్య చేసుకున్నాడు. లవ్‌ఫెయిల్యూర్‌నే బలవన్మరణానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ తిరుమలనగర్‌లో నివాసం ఉంటున్న నిభాష్ (25) పెట్లబుర్జులో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. అయితే ఆమె కుటుంబసభ్యులు పెళ్లికి నిరాకరించారు. దీంతో నిభాష్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలోనే రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకుముందు ఈ విషయాన్ని వాట్సాప్‌లో తన స్నేహితులకు సమాచారం అందించాడు. అయితే ఉదయం స్నేహితులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించగా.. నిభాష్ విగతజీవిగా కనిపించాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పదో తరగతి విద్యార్థి బలవన్మరణం



**హైదరాబాద్, ఆగస్ట్ 31:** మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. చదువు సరిగా రావడం లేదనే మనస్తాపంతో 16 ఏళ్ల పదో తరగతి విద్యార్థి మల్లికార్జున్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మల్లికార్జున్ తండ్రి పెయింటింగ్ పని చేస్తూ కుమారుడిని చదివిస్తున్నాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. విద్యార్థి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన మియాపూర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు దారితీసిన పూర్తి కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కన్న బిడ్డ మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీ ఆత్మహత్య




**హైదరాబాద్, ఆగస్ట్ 31:** నగరంలోని చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీ ఆత్మహత్య కలకలం రేపుతోంది. కంది సాగర్(31) అనే రిమాండ్ ఖైదీ.. జైలు వాష్‌రూమ్‌లో ఉరి వేసుకుని బలవన్మరణానికి యత్నించాడు. వెంటనే గుర్తించిన జైలు సిబ్బంది హుటాహుటిన సాగర్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే ఖైదీ మృతి చెందాడు. రోడ్డు ప్రమాదం కేసులో రిమాండ్‌లో ఉన్న సాగర్‌ను ఇటీవల నిజామాబాద్ జైలు నుంచి చంచల్‌గూడ జైలుకు బదిలీ చేశారు. ఈ ఘటనపై జైలు అధికారులు దర్యాప్తు చేపట్టారు. సాగర్ ఆత్మహత్యకు గల కారణాలు, ఘటనకు దారితీసిన పరిస్థితులపై అధికారులు ఆరా తీస్తున్నారు.

# పదేళ్లలో అప్పులే తప్ప అభివృద్ధి ఏదీ?

- అప్పును నెత్తిన పెట్టిన కేసీఆర్
- 8.11 లక్షల కోట్లకు 90వేల కోట్లు వడ్డీల చెల్లింపు
- మూసారాం బాగ్ బ్రిడ్జిని కూడా నిర్మించలేదు
- తాము అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పరుగులు
- అంబర్‌పేటలో పదెకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు
- అంబర్‌పేట సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ఆగస్ట్ 31:** తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ పాలనపై సీఎం రేవంత్ రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. గతంలో 16 మంది ముఖ్యమంత్రులు కలిసి 60 ఏళ్లకు పైగా పాలించినా రాష్ట్ర అప్పులు రూ.70 వేల కోట్లుగా ఉండేవని, కేసీఆర్ మాత్రం తొమ్మిదేళ్ల పాలనలో అప్పులను భారీగా పెంచారని ఆరోపించారు. రూ.70 వేల కోట్ల అప్పును రూ.8.11 లక్షల కోట్లకు తీసుకెళ్లారని విమర్శించారు. ప్రస్తుతం ఆ అప్పులకు సంబంధించిన అసలు, వడ్డీ చెల్లింపుల కోసం ప్రతి నెలా భారీ మొత్తాన్ని కేటాయించాల్సి వస్తోందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పుల కారణంగా ఏడాదికి సుమారు రూ.90 వేల కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రం ఇలాంటి ఆర్థిక పరిస్థితుల్లో ఉన్న సమయంలోనే డిసెంబర్ 7న ప్రభుత్వం తమ చేతుల్లోకి వచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం తమపై భారీగా ఆర్థిక భారాన్ని మోపి వెళ్లిందని విమర్శించారు. రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రణాళికబద్ధంగా రాష్ట్రంలో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. మూసీ నదిపై మూసారాంబాగ్‌లో నిర్మించిన కొత్త వంతెనను ముఖ్యమంత్రి ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో సిఎం మాట్లాడారు. అంబర్‌పేటలో ఏ కార్యాలయాలూ లేవు. పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కొంచెం వర్షం వస్తే మూసారాంబాగ్ బ్రిడ్జి మునిగేది. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు బ్రిడ్జి కట్టలేకపోయిందన్నారు. కానీ తాము రెండేళ్లలోనే వంతెనను పూర్తి చేశాం. ఊరి బయట పది కిలోమీటర్ల అవతల డబుల్ బెడ్ రూంలు కడితే ఇక్కడ ఉన్న వాళ్లకు అవి ఎలా ఉపయోగపడతాయి? అంబర్‌పేటలో 10 ఎకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలు కట్టాలని కంకణం కట్టుకున్నాం. బతుకమ్మ కుంటను కబ్జా చేయడానికి ప్రయత్నం చేసింది ఎవరో తెలియదా? ఈరోజు బతుకమ్మ కుంట పేదలకు అంకితం అయింది. విమానం నుంచి పూలు చల్లిన ఎడ్ల సుధాకర్.. మళ్లీ బతుకమ్మ కుంటను ఆక్రమించాలని చూస్తున్నారు. ఆయన వెనుక ఉన్నదెవరో ఆలోచించాలన్నారు. హైడ్రాపై, నాపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. కబ్జాలు ఎవరు చేస్తున్నారో ప్రజలు ఆలోచించాలి. 2023 డిసెంబర్ 7న మీ ఆశీర్వాదం వల్ల ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాయి. ప్రజా ప్రభుత్వం వచ్చి 1000 రోజులు పూర్తయింది. రేవంత్ రెడ్డిపై బురద చల్లడానికి కొన్ని అల్లరి మూకలు బయల్దేరాయి. చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తున్నామే తప్ప వాటిలో విల్లాలు, ఫామ్‌హౌస్‌లు మేం కట్టలేదని ఎద్దేవా చేశారు. మేం అధికారంలోకి వచ్చే నాటికి ఆర్థిక పరిస్థితి దివాలా తీసింది. ఏడో తేదీ వచ్చినా జీతాలు ఇవ్వలేని పరిస్థితి. రూ.70 వేల కోట్ల అప్పును.. 9 ఏళ్లలో రూ.8.11 లక్షల కోట్లకు చేర్చారు. 16 మంది సీఎంలు చేసిన అప్పు రూ.70 వేల కోట్లు. కేసీఆర్ ఒక్కరే రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు మధ్య మధ్యలో నన్ను బెదిరిస్తున్నారు. మేం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్కసారైనా ఒకటో తేదీనా జీతాలు ఇవ్వకుండా ఉన్నామా? ఆనాడు పరిపాలన ఎలా ఉందో.. నేడు ఏవిధంగా ఉందో ప్రభుత్వ ఉద్యోగులు ఆలోచించాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై కూడా రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రిటైర్మెంట్ బకాయిల రూపంలో రూ.6 వేల కోట్లను వంద రోజుల్లో చెల్లించామని తెలిపారు. కేసీఆర్ హయాంలో నిలిచిపోయిన పీఆర్సీని తమ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ వైద్యం అందించే ఆరోగ్య భద్రత కార్డులను పునరుద్ధరించామని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం విషయంలోనూ తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని రేవంత్ తెలిపారు. 32 నెలల్లో ఆర్టీసీకి రూ.11 వేల కోట్లు చెల్లించామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నప్పటికీ ఆర్టీసీకి ఆర్థిక నష్టం రాకుండా ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తోందని వివరించారు. గతంలో ఆర్టీసీ కార్మికులు చనిపోయినా పట్టించుకోలేదని కేసీఆర్‌పై విమర్శలు చేశారు. 2024 జనవరి 1 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నామని సీఎం అన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గతంలో ఆరు నెలల పాటు జీతాలు ఆలస్యమయ్యేవని, ఇప్పుడు ఐదో తేదీకే జీతాలు అందుతున్నాయని పేర్కొన్నారు. రిటైర్మెంట్ వయసు పెంపు, రూ.8 వేల కోట్ల బకాయిల భారాన్ని కూడా గత ప్రభుత్వం తమపై వదిలి వెళ్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఉద్యోగులు గత పరిస్థితులు, ప్రస్తుత పరిస్థితులను పోల్చి చూడాలని సూచించారు.

# కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలి



- వెయ్యి రోజుల్లో రూ.1.24 కోట్ల జీతభత్యాలు
- ప్రజల కోసం ఒక్కసారైనా బయటకు వచ్చారా?
- ఆరు రోజులపాటు ఆందోళనలకు సీఎం పిలుపు
- పదేళ్ల పాలనపై అసెంబ్లీలో చర్చకు సవాల్

**హైదరాబాద్, ఆగస్ట్ 31:** కేసీఆర్ 1000 రోజుల్లో కోటి 24 లక్షల 40 వేల రూపాయలు జీతం తీసుకున్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి 365 రోజులు ఉద్యోగానికి హాజరు కాకపోతే డిస్మిస్ చేస్తారు. మరి కేసీఆర్‌ను ఏం చేయాలి. ప్రతిపక్ష నాయకుడి హోదా ఉన్నందుకు ఆయనకు ఇన్నిరోజులు సెక్యూరిటీ, ఇల్లు, బు÷-లలెట్ ప్రూఫ్ వాహనాలు తదితర వసతుల కోసం ప్రభుత్వం రూ.21 కోట్లు ఖర్చు చేసింది. కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి. ఆయన రాజీనామా కోరుతూ ప్రజలు ఊరూరా ఆందోళనలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. అంబర్‌పేట సభలో సిఎం మాట్లాడుతూ కేసీఆర్‌కు.. నాకు పోలిక ఏంటి..? కేసీఆర్ సీఎం అయితే ఆయన కుటుంబ సభ్యులు, బంధువులకు పదవులు కట్టబెట్టారు. నేను సీఎం అయ్యాక ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పదవులు ఇచ్చాం. దేశంలోనే ప్రధాన ప్రతిపక్ష నేత వైఫల్యం చెందిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. పదేళ్లలో మీరు ఏం చేశారో.. రెండున్నరేళ్లలో.. మేం ఏం చేశామో అసెంబ్లీలో చర్చకు సిద్ధం. ఈ వెయ్యి రోజుల్లో జనం కోసం కేసీఆర్ ఒక్కసారైనా బయటకు వచ్చారా? ఈ వెయ్యి రోజుల్లో ప్రధాన ప్రతిపక్ష నేత రూ.22.24 కోట్ల ప్రభుత్వ వేతనం తీసుకున్నారు. రేపటి నుంచి 6 రోజులపాటు ప్రధాన ప్రతిపక్ష నేత రాజీనామా చేయాలంటూ ఆందోళనలు చేయాలి.’ అని ప్రతిపక్ష నేతపై సీఎం రేవంత్ ఘాటైన విమర్శలు చేశారు. ఉస్మానియా ఆసుపత్రిని 2 వేల పడకలతో కడుతున్నాం. వచ్చే ఏడాదిలో ప్రారంభిస్తాం. సనత్‌నగర్ టిమ్స్‌కు మర్రిచెన్నారెడ్డి పేరు, అల్వాల్‌లో ఉన్న టిమ్స్‌కు టి.అంజయ్య పేరు, ఎల్బీనగర్ టిమ్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు, వరంగల్‌లో ఉన్న టిమ్స్‌కు ప్రొ.జయశంకర్ పేరు పెడతాం. బ్రిటీష్ హయాంలో 1931లో కులగణన చేస్తే.. 100 ఏళ్లలో మళ్లీ కులగణన చేసేందుకు ఈ దేశంలో ఏ నాయకుడు ధైర్యం చేయలేదు. జనగణన, కులగణన చేస్తారా లేదా గద్దె దిగుతారా అని తెలంగాణ సమాజం ప్రధాని మోదీకి సవాల్ విసిరిందన్నారు.

# వచ్చే మార్చి నాటికి లక్ష ఉద్యోగాల భర్తీ

**రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి వెల్లడి**

**మహబూబాబాద్, ఆగస్ట్ 31:** వచ్చే మార్చి నాటికి రాష్ట్రంలో లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తామని రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ప్రకటించారు. అలాగే వారానికి ఒక ఉద్యోగ నోటిఫికేషన్ విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వేం నరేందర్ రెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. ఉద్యోగాల భర్తీకి సంబంధించి నిరుద్యోగులకు వరుసగా అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. మానుకోటలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ఉద్యోగాల ఉచిత శిక్షణ శిబిరంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే డిసెంబర్‌లో మరోసారి పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఆయన ప్రకటించారు. పోలీస్ ఉద్యోగాల భర్తీని మూడు విడతల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. పోలీస్ శాఖలో ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలకు వివరించడంలో వెనుకంజలో ఉందని వేం నరేందర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తమవాళ్లు కొంత వెనుకబడ్డారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగ నియామక పరీక్షలకు సంబంధించిన అనేక ప్రశ్నపత్రాల లీకేజీలు జరిగాయని ఆయన గుర్తు చేశారు. చివరకు జిరాక్స్ సెంటర్లలో కూడా ప్రశ్నపత్రాలు లభించే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రస్తుతం ఉద్యోగ నియామక ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు.




# నర్సుపై అఘాయిత్యం.. ఆపై హత్య!

**తుక్కుగూడ కేసులో నిందితుడి అరెస్ట్**

**అత్యాచారం జరిగినట్లు పోస్టుమార్టం నివేదిక**

**సీసీటీవీ ఆధారాలతో సనావుల్లా గుర్తింపు**

**కిటికీ మార్గంలో హాస్టల్‌లోకి ప్రవేశించినట్లు పోలీసుల నిర్ధారణ**



**హైదరాబాద్, ఆగస్టు 31:** తుక్కుగూడలో నర్సు హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. యువతిపై అత్యాచారం జరిగినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. కేసులో ప్రధాన నిందితుడిగా అనుమానిస్తున్న బిహార్‌కు చెందిన సనావుల్లా ఖాన్‌ను అరెస్ట్ చేశారు. విచారణలో అతడు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా అత్యాచారానికి సంబంధించిన సెక్షన్లను కూడా కేసులో చేర్చేందుకు చర్యలు చేపట్టారు. తుక్కుగూడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న యువతి శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. రాఖీ పండుగ సందర్భంగా తోటి నర్సులు స్వగ్రామాలకు వెళ్లడంతో ఆమె హాస్టల్‌లో ఒంటరిగా ఉన్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు పోలీసులు గుర్తించారు. పహాడీషరీఫ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆసుపత్రి సమీపంలోని కార్ల మెకానిక్ షాపులో పనిచేస్తున్న సనావుల్లాపై అనుమానం రావడంతో పోలీసులు అతడి కదలికలపై దృష్టి సారించారు. యువతి ఉంటున్న గది కిటికీకి గ్రిల్స్ లేకపోవడంతో అదే మార్గంలో నిందితుడు లోపలికి ప్రవేశించినట్లు దర్యాప్తులో గుర్తించారు. యువతిపై లైంగిక దాడికి పాల్పడగా ఆమె ప్రతిఘటించడంతో గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. హత్య అనంతరం అక్కడి నుంచి తప్పించుకునేందుకు నిందితుడు ప్రయత్నించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో మెకానిక్ షాపు యజమానికి ఫోన్ చేసి పెట్రోల్ కావాలని అడిగినట్లు విచారణలో గుర్తించారు. మరోవైపు యువతి మృతదేహం బయటపడిన తర్వాత పోలీసులు ఘటనాస్థలంలో దర్యాప్తు చేపట్టిన సమయంలో సనావుల్లా అక్కడే ఉన్నట్లు గుర్తించారు. ఏం జరిగిందంటూ పోలీసులను ప్రశ్నిస్తూ అనుమానం రాకుండా వ్యవహరించినట్లు సమాచారం. అయితే డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టగా జాగిలం మెకానిక్ షాపు వద్దకు వెళ్లి ఆగడంతో పోలీసులకు అనుమానం బలపడింది. దీంతో సనావుల్లాను అదుపులోకి తీసుకుని విచారించారు. సీసీటీవీ దృశ్యాలు, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం ప్రశ్నించగా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో మరెవరైనా ప్రమేయం ఉందా? నేరానికి ముందస్తు ప్రణాళిక ఏమైనా ఉందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ధరణి కన్నా దరిద్రంగా 'భూభారతి'!

- 22ఏతో 50 లక్షల మందికి ఇబ్బందులు: బీజేపీ
- నిషేధిత జాబితాపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- స్వతంత్ర సంస్థతో విచారణకు రామచందర్‌రావు డిమాండ్
- సెప్టెంబర్ 7లోగా పరిష్కరించకుంటే అసెంబ్లీ ముట్టడి: రఘునందన్



**సిద్దిపేట, ఆగస్టు 31:** బీఆర్ఎస్ హయాంలో తీసుకొచ్చిన ధరణి కంటే కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి మరింత దారుణంగా తయారైందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు విమర్శించారు. 22ఏ నిషేధిత జాబితాతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50 లక్షల మంది ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. 22ఏ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిద్ధిపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట బీజేపీ నిర్వహించిన మహాధర్నాలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ అర్థంలేని విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. తప్పు జరిగిందని ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి అంగీకరించినప్పటికీ దానిని సరిదిద్దడం లేదని విమర్శించారు. "నాడు బీఆర్ఎస్.. నేడు కాంగ్రెస్. టైటిల్ మారింది తప్ప దోపిడీ విధానాలు మారలేదు" అని ఎద్దేవా చేశారు. ఒక సర్వే నంబర్‌లో కేవలం రెండు ప్లాట్లకు సమస్య ఉంటే వేలాది ప్లాట్లను నిషేధిత జాబితాలో చేర్చారని రామచందర్‌రావు ఆరోపించారు. అదే సర్వే నంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇల్లు కూడా ఉందని, అది మాత్రం 22ఏ జాబితా నుంచి ఎలా బయటకు వచ్చిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 30 శాతం కమిషన్‌తో నడుస్తోందని ఆరోపించిన ఆయన.. పేదల భూములను ప్రభుత్వం తీసుకుని విక్రయిస్తోందని విమర్శించారు. తమ భూములను కాపాడాలంటూ పేద రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని పేర్కొన్నారు. 22ఏ నిషేధిత జాబితాపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయడంతో పాటు స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రైతుల కోసం బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని, అవసరమైతే జైలుకెళ్లేందుకూ సిద్ధమని ప్రకటించారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యేలోగా 22ఏ సమస్యపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులు, పేదలకు న్యాయం జరుగుతుందని చెప్పారని, కానీ ఇప్పుడు వారి పరిస్థితి "పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లు" తయారైందని విమర్శించారు. తప్పులను సరిచేస్తామని చెప్పిన ప్రభుత్వం.. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. భూభారతి వస్తే రైతుల కష్టాలు తీరుతాయని చెప్పారని, కానీ ఇప్పుడు రైతులు తమ భూముల సమస్యల పరిష్కారం కోసం తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇల్లు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సంబంధించిన భూములు కూడా 22ఏ పరిధిలోకి వచ్చాయని పేర్కొంటూ.. వాటి తొలగింపునకు సంబంధించిన దరఖాస్తులను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. వారి ఆస్తులు 22ఏ నుంచి బయటకు వస్తే రైతుల భూములను ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. సిద్ధిపేట జిల్లాలో భూములు ఎవరికి తెలియకుండా మాయమవుతున్నాయని రఘునందన్‌రావు ఆరోపించారు. వివిధ అవసరాలు, ప్రాజెక్టుల పేరుతో భూములు తీసుకుంటున్నారని విమర్శించారు. భూముల విక్రయాలతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సెప్టెంబర్ 7లోగా 22ఏ సమస్యపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని రఘునందన్‌రావు హెచ్చరించారు. రైతుల భూములను నిషేధిత జాబితాలో పెట్టిన కాంగ్రెస్‌ను ప్రజలే రాజకీయంగా నిషేధించాలని పిలుపునిచ్చారు.



# రైల్వేల అభివృద్ధికి చర్యలు

**మహబూబ్‌నగర్‌లో ఆధునీకరణ పనులు పరిశీలించిన కిషన్ రెడ్డి**

**మహబూబ్‌నగర్,ఆగస్ట్31 :** తెలంగాణ రాష్ట్రంలోని రైల్వేల అభివృద్ధికి అంకితభావంతో తాము పనిచేస్తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొత్త రైల్వే ట్రాక్‌లు, వాటిని ఉన్నతీకరణ చేసే విధంగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఆధునికీకరణ పనులు కొనసాగుతున్న రైల్వేస్టేషన్ పనులను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణసోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్‌ను రైల్వేహబ్‌గా మారుస్తున్నామని వెల్లడించారు. 5 వందేభారత్ రైళ్లను కేందప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిందని ప్రస్తావించారు. మోదీ హయాంలోని పదేళ్లలో 100 కొత్త రైళ్లను తెలంగాణలో అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడించారు. తెలంగాణలో 42 రైల్వేస్టేషన్లను ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామని చెప్పుకొచ్చారు. 2014కు ముందు రైల్వేస్టేషన్లు అధ్వానంగా ఉండేవని.. కానీ నేడు మోదీ హయాంలో పరిస్థితి మారిందని తెలిపారు. ప్రయాణికులు భాగస్వాములైతే స్వచ్ఛస్టేషన్లు సాధ్యమవుతాయని వివరించారు. రైల్వేస్టేషన్లు ఏయిర్‌-పోర్టు స్థాయిలో ఉండాలన్నదే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని ఉద్ఘాటించారు. 2014కు ముందు ఉమ్మడి రాష్ట్రంలో రూ.886 కోట్ల రైల్వే బడ్జెట్ ఉంటే 2026-27 బడ్జెట్లో తెలంగాణకే రూ.5454 కోట్లను కేంద్రం కేటాయించిందని కిషన్‌రెడ్డి తెలిపారు. స్వాతంత్యం÷-ర వచ్చినప్పటి నుంచి తెలంగాణలో రైల్వే రంగం నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. దేశంలో 7 బు÷-లలెట్ ట్రైన్స్ ప్రవేశపెడితే.. తెలంగాణకు మూడు ఇచ్చామని.. ఇది రైల్వేరంగంలో సువర్ణాధ్యాయమని నొక్కిచెప్పారు. రూ.5 లక్షల కోట్లతో బు÷-లలెట్ ట్రైన్స్ అందుబాటులోకి తీసుకువస్తున్నామని స్పష్టం చేశారు. ప్రమాదాలు జరగకుండా దేశంలోనే తొలిసారిగా కవచ్ ప్రాజెక్ట్‌ను తెలంగాణలో ప్రయోగాత్మకంగా అమలు చేయబోతున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణ కోసం కష్టపడ్డ నన్నే గెంటేశారు!

**ప్రశాంత్‌రెడ్డి 'శకుని' పాత్ర పోషించారు: కవిత**

**జీవితంలో ఆయనను మాత్రం క్షమించనని వ్యాఖ్య**

**కేసీఆర్‌తో తనను విడదీశారని తీవ్ర ఆరోపణ**

**కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నించారని విమర్శ**

**నిజామాబాద్ పాంచజన్య సభలో భావోద్వేగం**






**నిజామాబాద్, ఆగస్టు 31:** తెలంగాణ ఉద్యమం కోసం, పార్టీని అధికారంలోకి తీసుకురావడం కోసం ఎంతో కష్టపడిన తననే చివరకు అన్యాయంగా బయటకు గెంటేశారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తండ్రి కేసీఆర్‌కు తనను దూరం చేయడంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన మహాభారతంలోని 'శకుని' పాత్ర పోషించారని మండిపడ్డారు. జీవితంలో హరీశ్‌రావునో, సంతోష్‌రావునో క్షమిస్తానేమో కానీ ప్రశాంత్‌రెడ్డిని మాత్రం క్షమించబోనని వ్యాఖ్యానించారు. నిజామాబాద్‌లో నిర్వహించిన 'పాంచజన్య' సభలో కవిత ప్రసంగిస్తూ పలుమార్లు భావోద్వేగానికి గురయ్యారు. "తెలంగాణ కోసం కష్టపడ్డాను. పార్టీ అధికారంలోకి రావడానికి పనిచేశాను. చివరకు అదే పార్టీలో నాకు స్థానం లేకుండా చేశారు. నేను ఏం తప్పు చేశానని తిహార్ జైలులో పెట్టారు? కష్టాల్లో ఉన్న సమయంలో కనికరం కూడా చూపకుండా పార్టీ నుంచి వెళ్లగొట్టారు" అంటూ కంటతడి పెట్టారు.

**'ప్రశాంత్‌ను మాత్రం క్షమించను'**

"హరీశ్‌రావునో, సంతోష్‌రావునో క్షమిస్తానేమో.. ప్రశాంత్‌రెడ్డిని మాత్రం జీవితంలో క్షమించను. ఆయనకు నా ఉసురు తగులుతుంది. కేసీఆర్ ఆయనను కుమారుడిలా చూసుకుంటే మా మధ్య చిచ్చుపెట్టారు" అని కవిత ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయిన రెండో రోజే ప్రశాంత్‌రెడ్డి కాంగ్రెస్ నేతలతో సంప్రదింపులు జరిపారని కవిత ఆరోపించారు. కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారని, అమెరికాలో ఉన్న సమయంలోనూ వేం నరేందర్‌రెడ్డితో సంప్రదింపులు జరిపారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు సంబంధించి ప్రశాంత్‌రెడ్డి స్పందనను ఆమె ప్రస్తావించలేదు. ప్రశాంత్‌రెడ్డి మంత్రి కావడానికి తాను ఎంతో ప్రయత్నించానని కవిత చెప్పారు. ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి సహా నిజామాబాద్ జిల్లాలో పలువురు నేతల విజయానికి కష్టపడ్డానని, చివరకు వారే తన రాజకీయ ఓటమికి కారణమయ్యారని ఆరోపించారు.

**'కన్నీళ్లు చూసి పిరికిదాన్ని అనుకోవద్దు'**

"ఈ గడ్డ బిడ్డగా మిమ్మల్ని చూడగానే భావోద్వేగంతో కన్నీళ్లు ఆగడం లేదు. కన్నీళ్లు పెట్టుకున్నానని పిరికిదాన్ని అనుకోవద్దు. నిజాయితీగా ఉన్నాను కాబట్టే బాధ కలుగుతోంది" అని కవిత పేర్కొన్నారు. తాను జైలులో ఉన్న సమయంలో తన అత్త అండగా నిలిచారని గుర్తుచేసుకున్నారు. తనపై నమోదైన కేసులను ప్రస్తావిస్తూ.. ఈడీ, సీబీఐ కేసులతో కొన్నేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొన్నానని చెప్పారు. ఎన్ని కేసులు పెట్టినా తాను తప్పు చేయలేదనే చెబుతూ వచ్చానన్నారు. రాజకీయ పదవుల కోసం తెలంగాణ రక్షణ సేనను ఏర్పాటు చేయలేదని, ప్రజల కోసం పనిచేయాలన్నదే తన లక్ష్యమని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపైనా కవిత విమర్శలు చేశారు. ప్రాజెక్టుకు భారీగా నిధులు ఖర్చు చేసినా నిజామాబాద్ జిల్లాకు ఆశించిన ప్రయోజనం దక్కలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో అవినీతి జరిగిందని, అప్పటి కొందరు ఎమ్మెల్యేల ఆస్తులు పదేళ్లలో భారీగా పెరిగాయని వ్యాఖ్యానించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపైనా కవిత విమర్శలు గుప్పించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన ప్రధాన ప్రతిపక్షం కూడా తన బాధ్యతను సమర్థంగా నిర్వర్తించడం లేదని అన్నారు. "నిజామాబాద్ కోడలిగా ఇక్కడ పనిచేశాను. నాకు మరో అవకాశం ఇవ్వండి. మీరే నా ధైర్యం" అని కవిత ప్రజలను కోరారు. రాజకీయాలే లక్ష్యమైతే తాను ఏ పార్టీలోకైనా వెళ్లగలనని, ప్రజల కోసం పనిచేయాలన్న ఉద్దేశంతోనే కొత్త రాజకీయ ప్రయాణాన్ని ఎంచుకున్నానని చెప్పారు. నిజామాబాద్ జిల్లాలో ఐదు స్థానాల్లో తెలంగాణ రక్షణ సేన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. సామాజిక న్యాయమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని, అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీ వ్యవహారంపైనా కవిత ఆరోపణలు చేశారు. మాజీ మంత్రి కేటీఆర్‌కు సన్నిహితుడైన కోరుట్ల ఎమ్మెల్యే దానిని కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పైనా విమర్శలు చేస్తూ.. మాధవనగర్ రైల్వే బ్రిడ్జిని ఇప్పటికీ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. అర్వింద్ కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని కూడా ఆరోపించారు. అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ప్రజా సమస్యలపై విఫలమయ్యాయని పేర్కొన్న కవిత.. తెలంగాణ రాజకీయాల్లో కొత్త శక్తి రావాల్సిన అవసరం ఉందని, ప్రజలు తమకు అవకాశం ఇవ్వాలని కోరారు.

# యూత్ కాంగ్రెస్ నేతల దాడి హేయం

**బిజెపి కార్యాలయం రక్షణపై పోలీసుల నిర్లక్ష్యం**

**మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్**



**హైదరాబాద్,ఆగస్ట్31 :** హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద యూత్ కాంగ్రెస్ నేతలు వ్యవహరించిన తీరుపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కార్యాలయం వద్ద ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దగ్ధం చేసి, ఆ పార్టీ కార్యాలయ గేటుకు నల్ల రంగు పూస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థ పనిచేస్తోందా? అని నిలదీశారు. పట్టపగలు బీజేపీ ఆఫీస్‌పై దాడి చేస్తుంటే పోలీసులు తమాషా చూస్తున్నారా? అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు తొత్తులుగా పోలీసులు పనిచేస్తున్నారా? అని బండి సంజయ్ మండిపడ్డారు. భాగ్యనగరం నడిబొడ్డున ఉన్న జాతీయ పార్టీ రాష్ట్ర కార్యాలయానికి రక్షణ కల్పించే బాధ్యత మీకు లేదా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. యూత్ కాంగ్రెస్ నేతలు అరాచకం సృష్టిస్తోంటే అక్కడ పోలీసులెందుకు లేరు? అని నిలదీశారు. పోలీసుల వైఫల్యానికి మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. తమ సహనాన్ని చేతగానితనంగా భావిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. ఖబడ్దార్ కాంగ్రెస్ నేతల్లారా.... తాము తలుచుకుంటే బయట తిరగలేరని బండి సంజయ్ హెచ్చరించారు. ఈ ఘటనకు కారణమైన వారిని అరెస్ట్ చేసి చట్టం ముందు సాయంత్రంలోపు నిలబెట్టాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యూత్ కాంగ్రెస్ నేతల చర్యకు మించి ప్రతి చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. బీజేవైఎం కార్యకర్తలు తలుచుకుంటే యూత్ కాంగ్రెస్ నేతలు బయట తిరగలేరని మందలించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ నాయకత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్ కార్యాలయాలను బీజేపీ శ్రేణులు దిగ్బంధిస్తారని హెచ్చరించారు. జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్ నేతలు బీజేపీ ఆఫీస్‌పై చేసిన దాడిపై తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులకు కేంద్రమంత్రి బండి సంజయ్ ఫోన్ చేసి ఆరా తీశారు. బీజేపీ ఆఫీస్ వద్ద ప్రధాని దిష్టిబొమ్మ దగ్ధం చేసి, కార్యాలయ గేటుకు నల్ల రంగు పూస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారన్ని ÷ర్ అయ్యారు. పట్టపగలు బీజేపీ ఆఫీస్‌పై దాడి చేస్తుంటే ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులను వివరణ కోరారు. తక్షణమే ఈ ఘటనకు బాధ్యులైన వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# కృష్ణా జలాలు తరలిపోతుంటే చోద్యమా?

**వెలిగొండపై హరీశ్‌రావు ఆగ్రహం**

**తెలంగాణకు తీరని ద్రోహమని విమర్శ**

**కృష్ణా బేసిన్ ప్రాజెక్టులు ఎండుతున్నాయని ఆవేదన**

**కేఆర్ఎంబీ ప్రేక్షకపాత్రపై మండిపాటు**

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందించాలని డిమాండ్**

**హైదరాబాద్, ఆగస్టు 31:** తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ తరలించుకుపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇంకెప్పుడు మేల్కొంటుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ప్రశ్నించారు. నీటి కేటాయింపులు లేకున్నా, వరద జలాలు రాకున్నా వెలిగొండ ప్రాజెక్టు ద్వారా బేసిన్ దాటి కృష్ణా జలాలను ఏపీ తరలిస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. ఇది తెలంగాణ ప్రయోజనాలకు తీరని ద్రోహమని విమర్శించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో సాగునీటి కష్టాలు తీవ్రమవుతుంటే.. మరోవైపు ఏపీ ప్రభుత్వం తెలంగాణ నీటి హక్కులను దెబ్బతీసేలా కృష్ణా జలాలను తరలిస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. కృష్ణా బేసిన్‌లోని భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీరు లేక ఆయకట్టు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే.. బేసిన్‌తో సంబంధం లేని ప్రాంతాలకు నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలిస్తున్నారని పేర్కొన్నారు. మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జునసాగర్ కుడి కాల్వల ద్వారా ఇప్పటికే నీటిని తరలిస్తున్నారని, ఇప్పుడు వెలిగొండ కూడా ఆ జాబితాలో చేరిందని విమర్శించారు. "తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలిస్తున్నా రేవంత్ ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదు? రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండ సహా తెలంగాణ రైతులకు చేస్తున్న తీరని ద్రోహం ఇది" అని హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా జలాలను రాష్ట్రంలోని పొలాలకు మళ్లించాల్సిన ప్రభుత్వం.. ఏపీకి పరోక్షంగా ఎందుకు సహకరిస్తోందని ప్రశ్నించారు. ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సైతం పట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన సంస్థే ప్రేక్షకపాత్ర పోషిస్తే రాష్ట్ర నీటి హక్కులను ఎవరు కాపాడతారని నిలదీశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెంటనే



స్పందించి కృష్ణా నదీ యాజమాన్య బోర్డుపై ఒత్తిడి తీసుకురావాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపడంతో పాటు ఆయకట్టుకు నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

# ఆడబిడ్డల భద్రత ప్రశ్నార్థకం!

**తుక్కుగూడ ఘటనే నిదర్శనం: హరీశ్‌రావు**

**సీఎం ఏం చేస్తున్నారని ప్రశ్న.. సమగ్ర దర్యాప్తునకు డిమాండ్**

**మహిళల రక్షణకు కఠిన చర్యలు చేపట్టాలి**

**హైదరాబాద్, ఆగస్టు 31:** తెలంగాణలో ఆడబిడ్డల భద్రత ప్రశ్నార్థకంగా మారడం సిగ్గుచేటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. తుక్కుగూడలో నర్సు హత్య ఘటనపై సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజల ఆస్తులకే కాకుండా ప్రాణాలకు కూడా భద్రత లేకుండా పోయిందని ఆరోపించారు. గురుకులంలో చదివి, పేదరికాన్ని అధిగమించి నర్సుగా సేవలందిస్తున్న యువతి హత్యకు గురికావడం తీవ్రంగా కలచివేసిందని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెపై లైంగిక దాడి జరిగినట్లు వెలుగులోకి వచ్చిన అంశాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత శాంతిభద్రతలు క్షీణించాయని హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలు జరుగుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. "ఇంకెంత మంది ఆడబిడ్డలు బలైతే ప్రభుత్వం మేల్కొంటుంది? మహిళలకు భద్రత కల్పించలేని పరిస్థితి ఎందుకు వచ్చింది?" అని నిలదీశారు. తుక్కుగూడ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, నేరం రుజువైతే నిందితుడికి చట్టప్రకారం త్వరితగతిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళల భద్రతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు.

## సంపాదకీయం



# హిమాలయాల్లో వాటర్ బాంబ్స్!

**మంచుకొండల్లో పొంచి ఉన్న జలప్రళయం**

**భారత్‌లోనే 7,500 హిమానీనద సరస్సులు**

**200 వరకు అధిక ముప్పు జాబితాలో**

**గంగా పరీవాహకంలోనే 4,700కు పైగా సరస్సులు**

**ముందస్తు హెచ్చరిక వ్యవస్థలే రక్షణ కవచం**

పైకి ప్రశాంతంగా కనిపించే మంచుకొండలు.. వాటి మధ్య నిశ్శబ్దంగా పేరుకుపోతున్న అపార జలరాశి.. సహజ అడ్డుకట్ట ఒక్కసారి తెగిందంటే క్షణాల్లోనే దిగువ ప్రాంతాలపై విరుచుకుపడే జలప్రళయం! హిమాలయాల్లోని కొన్ని హిమానీనద సరస్సులు ఇప్పుడు ఇలాంటి ప్రమాదాన్నే మోస్తున్నాయి. అందుకే నిపుణులు వాటిని 'వాటర్ బాంబ్స్'గా అభివర్ణిస్తున్నారు. నేపాల్‌లో సంభవించిన భారీ వరదల నేపథ్యంలో భారత హిమాలయ ప్రాంతాల్లోని హిమానీనద సరస్సుల భద్రత మరోసారి చర్చకు వచ్చింది. హిమానీనదాలు కరిగే క్రమంలో ఏర్పడే సరస్సుల్లో భారీగా నీరు చేరుతుంది. మంచు, రాళ్లు, మట్టితో ఏర్పడిన సహజ అడ్డుకట్టలు ఆ నీటిని నిలువరిస్తుంటాయి. భారీ వర్షాలు, వేగంగా మంచు కరగడం, కొండచరియలు విరిగిపడటం లేదా భూకంపాల కారణంగా ఈ అడ్డుకట్టలు బలహీనపడి ఒక్కసారిగా తెగిపోతే.. అపారమైన నీటితో పాటు బురద, రాళ్లు దిగువకు దూసుకొస్తాయి. దీనినే హిమానీనద సరస్సు విస్ఫోట వరదగా పేర్కొంటారు. సాధారణ వరదలతో పోలిస్తే ఇలాంటి విపత్తుల్లో ముందస్తుగా స్పందించేందుకు సమయం చాలా తక్కువగా ఉండొచ్చు. ఎత్తైన ప్రాంతం నుంచి భారీ వేగంతో వచ్చే నీరు, రాళ్లు, బురద మార్గంలోని రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, నివాస ప్రాంతాలను తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంటుంది. నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతంలో ఇటీవల సంభవించిన భారీ వరదలు ఈ ప్రమాదంపై మరోసారి హెచ్చరికలు పంపాయి. భోటేకోశి, త్రిశూలి నదుల్లో వరద ప్రవాహం పెరగడంతో మధ్య నేపాల్‌లోని పలు ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమైనట్లు నివేదికలు పేర్కొన్నాయి. టిబెట్‌లోని నదీ మూల ప్రాంతాల సమీపంలో పరిస్థితులను కూడా అధికారులు నిశితంగా గమనిస్తున్నారు. జాతీయ విపత్తు నిర్వహణ వ్యవస్థకు చెందిన అధికారుల అంచనాల ప్రకారం భారత హిమాలయ ప్రాంతంలోని 11 నదీ పరీవాహక ప్రాంతాల్లో సుమారు 28 వేల హిమానీనద సరస్సులు ఉన్నట్లు సమాచారం. వాటిలో దాదాపు 7,500 సరస్సులు భారత భూభాగంలోనే ఉన్నట్లు అంచనా. ఒక్క గంగా నదీ పరీవాహక ప్రాంతంలోనే 4,700కు పైగా హిమానీనద సరస్సులు ఉన్నట్లు పేర్కొంటున్నారు. వీటన్నింటికీ ఒకే స్థాయిలో ప్రమాదం ఉందని మాత్రం భావించకూడదు. పరిమాణం, నీటి నిల్వ, సహజ అడ్డుకట్టల స్థిరత్వం, పరిసర భౌగోళిక పరిస్థితుల ఆధారంగా ప్రమాదాన్ని అంచనా వేస్తున్నారు. సుమారు 195 నుంచి 200 సరస్సులను అధిక ప్రమాదం ఉన్నవిగా గుర్తించినట్లు సమాచారం. హిమానీనద సరస్సు విస్ఫోట వరద ప్రభావం కేవలం మంచుకొండలకే పరిమితం కావాల్సిన అవసరం లేదు. ఎగువ ప్రాంతాల్లో ఒక్కసారిగా భారీ జలప్రవాహం ఏర్పడితే నదుల ద్వారా దిగువ ప్రాంతాలకు చేరి వరద తీవ్రతను పెంచే అవకాశం ఉంటుంది. నేపాల్ వైపు నుంచి ప్రవహించే కోసి, గండక్ వంటి నదీ వ్యవస్థల్లో అసాధారణ వరద ప్రవాహాలు ఏర్పడితే ఉత్తర బీహార్‌లోని పలు ప్రాంతాలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అలాగే సిక్కిం హిమాలయ ప్రాంతంలో విపత్తులు సంభవిస్తే తీస్తా నదీ పరీవాహకంలోని సిక్కిం, ఉత్తర బెంగాల్ ప్రాంతాలకు ముప్పు ఏర్పడవచ్చు. అయితే ఒక సరస్సు విస్ఫోటనం వల్ల 'పలు రాష్ట్రాలు కొట్టుకుపోతాయి' అని సాధారణీకరించడం సరికాదు. ప్రభావ తీవ్రత సరస్సు పరిమాణం, భౌగోళిక పరిస్థితులు, నదీ ప్రవాహ మార్గం వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. హిమాలయాల్లో ఉష్ణోగ్రతల మార్పులు, హిమానీనదాల కరుగుదలతో సరస్సుల పరిమాణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉండటంతో నిరంతర పర్యవేక్షణ కీలకంగా మారుతోంది. దీనికి తోడు పర్వత ప్రాంతాల్లో విచక్షణారహిత నిర్మాణాలు, నదుల సహజ ప్రవాహ మార్గాల్లో ఆక్రమణలు, పర్యావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోని మౌలిక వసతుల నిర్మాణం విపత్తు సంభవించినప్పుడు నష్టాన్ని మరింత పెంచవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రమాదకర హిమానీనద సరస్సులను గుర్తించి వాటిపై నిరంతర నిఘా ఉంచడం ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. ఉపగ్రహ చిత్రాల ద్వారా సరస్సుల విస్తీర్ణం, నీటి నిల్వలో మార్పులు, పరిసర భూభాగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను పరిశీలించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అధిక ప్రమాదం ఉన్న సరస్సుల వద్ద నీటిమట్టం, ఉష్ణోగ్రత తదితర మార్పులను గుర్తించే ఆటోమేటిక్ సెన్సార్లతో ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేయడం, ప్రమాద ప్రాంతాలను మ్యాపింగ్ చేయడం, అవసరమైన చోట సురక్షిత డ్రైనేజీ, నీటి మళ్లింపు వంటి ఇంజనీరింగ్ చర్యలు చేపట్టడం కీలకమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రమాద ప్రాంతాల్లో విచక్షణారహిత నిర్మాణాలను నియంత్రించడం కూడా అంతే ముఖ్యమని చెబుతున్నారు. నేపాల్ విపత్తు మరోసారి వినిపిస్తున్న హెచ్చరిక ఒక్కటే.. హిమాలయాల్లో పేరుకుపోతున్న జలరాశులను తేలిగ్గా తీసుకోవద్దు. మంచుకొండల మధ్య నిశ్శబ్దంగా ఉన్న సరస్సు ఎప్పుడు ప్రమాదకరంగా మారుతుందో నిరంతర శాస్త్రీయ పర్యవేక్షణతోనే గుర్తించగలం. విపత్తు వచ్చిన తర్వాత సహాయక చర్యలకంటే.. ముందే ప్రమాదాన్ని పసిగట్టి ప్రజలను అప్రమత్తం చేయడమే అసలైన రక్షణ.

# జాతీయ జెండాను అవమానిస్తే మూల్యం తప్పదు

**ఖలిస్థానీ వేర్పాటువాదులకు కిరణ్ రిజిజు హెచ్చరిక**

- న్యూయార్క్‌లో ఘటనపై కేంద్ర మంత్రి ఆగ్రహం
- దేశాన్ని, జెండాను అవమానించొద్దని హితవు
- నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** న్యూయార్క్‌లో భారత జాతీయ జెండాను అవమానించిన ఖలిస్థానీ వేర్పాటువాదులకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గట్టి హెచ్చరిక చేశారు. దేశాన్ని, జాతీయ జెండాను అవమానించే వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. న్యూయార్క్‌లోని మ్యాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో జరిగిన సభకు ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ హాజరైన సందర్భంగా స్టేడియం వెలుపల చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వీడియోను రిజిజు పంచుకున్నారు. "ఆర్‌ఎస్‌ఎస్‌ను లేదా బీజేపీని విమర్శించే హక్కు మీకు ఉందని మేము ఎప్పటి నుంచో చెబుతున్నాం. కానీ మా దేశాన్ని అవమానించవద్దు. ఒక విషయం జాగ్రత్తగా వినండి. మా దేశాన్ని, జాతీయ జెండాను అవమానిస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు" అని రిజిజు హెచ్చరించారు. వీడియోలో కనిపిస్తున్న దృశ్యాల ప్రకారం.. స్టేడియం వెలుపల కొందరు ఖలిస్థానీ మద్దతుదారులు నిరసనకు దిగారు. వారిలో ఓ వ్యక్తి భారత జాతీయ జెండాను కాలికి చుట్టుకుని అవమానించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులను గుర్తించి చర్యలు చేపట్టాలని అమెరికా ప్రభుత్వాన్ని కోరారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోహన్ భాగవత్ ప్రసంగించారు. అమెరికాలో ఉంటూ ఉపాధి పొందుతున్న వారు తమ కర్మభూమి పట్ల బాధ్యతను నెరవేర్చడంతో పాటు మాతృభూమితో అనుబంధాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. వివిధ దేశాల్లోని హిందువులు బాధ్యతాయుత జీవనంతో ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు.

# బాణాసంచా కర్మాగారంలో భారీ పేలుడు

**పేలుడు ధాటికి 11 మంది దుర్మరణం**

**యూపి సీఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి**



**లక్నో, ఆగస్టు 31:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో సోమవారం మధ్యాహ్నం ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. ఓ బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించి 11 మంది మృతిచెందగా.. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దారుణ ఘటన పిప్రి పోలీస్ స్టేషన్ పరిధి మనోరి గ్రామంలో చోటుచేసుకుంది. మృతులను ప్రియాంజలి (5), ప్రవీణ్ సింగ్ (13), జహన్వి (12), ఆదిత్య (12), ఆదిత్య (8), రవి (8), అంజు (32), జ్ఞాన్ సింగ్ (40), విక్రమ్ సరోజ్ (35), అన్ష్ (6), నానా (4)గా పోలీసులు గుర్తించారు. మృతులంతా ఫ్యాక్టరీ చుట్టుపక్కల నివసిస్తున్న వారేనని అధికారులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం వేళ బాణసంచా కర్మాగారంలో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు స్థానికంగా బీభత్సం సృష్టించింది. భారీ శబ్దంతో పేలుడు జరగడంతో ఫ్యాక్టరీ చుట్టుపక్కల ఇళ్లని పూర్తిగా ధ్వంసమయ్యాయి. తీవ్రంగా గాయపడిన 16 మందిని ప్రయాగ్‌రాజ్‌లోని ఎస్‌ఆర్ఎన్ ఆస్పత్రికి తరలించగా.. 11 మంది చికిత్స పొందుతూ మరణించారని జిల్లా మేజిస్ట్రేట్ అమిత్ పాల్ తెలిపారు. మరో ఐదుగురికి చికిత్స అందుతోందని ఆయన వెల్లడించారు. ఈ ఘటనలో మొత్తం 18 మందికి పైగా గాయపడినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాలను తొలగిస్తూ వాటి కింద చిక్కుకున్న వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కౌశాంబి జిల్లాలో ప్రమాదం తీవ్రంగా బాధించింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. గాయపడిన వారికి సరైన వైద్య చికిత్స అందేలా చూడాలని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహాయం అందించాలని స్థానిక అధికారుల కు ఆదేశాలు జారీ చేశాం. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.2లక్షలు, గాయపడిన వారికి ఒక్కొక్కరికీ రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ఆదేశాలు జారీ చేశాం.. అని ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

# మోదీ-పుతిన్ కీలక భేటీ

- వాణిజ్యం నుంచి రక్షణ వరకు విస్తృత చర్చలు
- ఇంధనం, పెట్టుబడుల సహకారంపై ప్రత్యేక దృష్టి
- ఎస్‌సీవో సదస్సు వేదికగా ఇరువురు నేతల సమావేశం
- ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తోనూ మోదీ భేటీ
- 'నోమాడ్ గేమ్స్'కు హాజరైన మోదీ-పుతిన్



**బిష్కెక్:** షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలకంగా సమావేశమయ్యారు. భారత్-రష్యా ద్వైపాక్షిక సంబంధాలతో పాటు వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, రక్షణ రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించడంపై ఇరువురు నేతలు చర్చించారు. కిర్గిజ్‌స్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న ఎస్‌సీవో సదస్సు సందర్భంగా ఈ భేటీ జరిగింది. భారత్-రష్యా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ఇరు దేశాలకు సంబంధించిన కీలక అంశాలను నేతలు సమీక్షించినట్లు సమాచారం. ఇటీవల మాస్కోలో భారత్-రష్యా అంతర్ ప్రభుత్వ కమిషన్ సమావేశం విజయవంతంగా జరిగిందని, దానికి కొనసాగింపుగా మోదీ-పుతిన్ భేటీలో ద్వైపాక్షిక సంబంధాలపై సమగ్ర సమీక్ష జరుగుతుందని భారత విదేశాంగ శాఖ అంతకుముందు వెల్లడించింది. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఇటీవల రష్యాలో రెండు రోజుల పర్యటన సందర్భంగా క్రెమ్లిన్‌లో పుతిన్‌తో సమావేశమయ్యారు. ప్రధాని మోదీ శుభాకాంక్షలను ఆయనకు తెలియజేశారు. ఈ పరిణామాల అనంతరం మోదీ-పుతిన్ ప్రత్యక్షంగా సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

### ఇరాన్ అధ్యక్షుడితోనూ మోదీ భేటీ

ఎస్‌సీవో సదస్సు సందర్భంగా ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తోనూ ప్రధాని మోదీ సమావేశమయ్యారు. దాదాపు రెండేళ్ల తర్వాత ఇరు దేశాల నేతలు సమావేశమైనట్లు కథనం పేర్కొంది. భారత్-ఇరాన్ సంబంధాలకు సంబంధించిన అంశాలు ఈ సందర్భంగా చర్చకు వచ్చినట్లు తెలిపింది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తోనూ మోదీ సమావేశమయ్యే అవకాశమున్నట్లు సమాచారం. అయితే ఇరువురు నేతల మధ్య ప్రత్యేక ద్వైపాక్షిక సమావేశానికి అధికారికంగా షెడ్యూల్ ఖరారు కాలేదని పేర్కొంది.

### 'నోమాడ్ గేమ్స్'లో మోదీ--పుతిన్

ఎస్‌సీవో సదస్సు కార్యక్రమాల అనంతరం నిర్వహించిన 'నోమాడ్ గేమ్స్'కు మోదీ, పుతిన్ హాజరయ్యారు. అంతర్జాతీయ వేదికపై ఇరువురు నేతలు కలిసి పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతకుముందు ప్రధాని మోదీ రెండు రోజుల ఉజ్బెకిస్థాన్ పర్యటనలో ఆ దేశ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయేవ్‌తో సమావేశమయ్యారు. శతాబ్దాల నాటి సాంస్కృతిక సంబంధాలు, ప్రజల మధ్య అనుబంధాన్ని పునాదిగా చేసుకుని భారత్-ఉజ్బెకిస్థాన్ ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించడంపై ఇరువురు నేతలు చర్చించినట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. 2001లో చైనా, రష్యా, నాలుగు మధ్య ఆసియా దేశాలతో భద్రతా వేదికగా ప్రారంభమైన షాంఘై సహకార సంస్థ.. కాలక్రమేణా సభ్యత్వం, ప్రభావాన్ని విస్తరించుకుంది. తాజా సదస్సు సందర్భంగా భారత్-రష్యా సంబంధాలపై జరిగిన మోదీ-పుతిన్ భేటీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

# అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం

**కెనడా దారుణమైన దుర్వినియోగదారు**

**కెనడాలో ఉన్న కంపెనీలన్నీ అమెరికాకు వచ్చేయాలి**

**ట్రూత్‌లో ట్రంప్ వరుస పోస్టులు**

**వాషింగ్టన్, ఆగస్టు 31:** అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలకు కెనడా ప్రధాని మార్క్ కార్నీ సహా ఇతర నేతలు గట్టిగా బదులు ఇస్తుండటంతో రెండు దేశాలు సంబంధాలు దిగజారుతున్నాయి. ఈ క్రమంలోనే ట్రంప్ మరోసారి ఆ దేశంపై విరుచుకుపడ్డారు. తమకు కెనడా నుంచి ఏమీ వద్దని పేర్కొన్న ఆయన తమ సుంకాలను తప్పించుకునేందుకు అక్కడి కంపెనీలన్నీ అమెరికాకు తరలివచ్చేయాలని సూచించారు. ఆ దేశం దారుణమైన దుర్వినియోగదారు అని మండిపడ్డారు. ఈ మేరకు ట్రూత్‌లో వరుస పోస్టులు పెట్టారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో నేను పోటీ చేస్తున్నానని ప్రకటించిన సమయంలోనే డెట్రాయిట్‌లోని కీలక ఫ్యాక్టరీని మూసివేయడానికి ఫోర్డ్ సిద్ధమైంది. ఎన్నికల్లో నేను ఆధిక్యంలోకి రావడంతో ఏం జరుగుతుందో చూద్దామని ఆ సంస్థ వేచి చూసింది. ఇప్పుడు నిరంతరాయంగా నడుస్తూ.. భారీగా లాభాలను ఆర్జిస్తోంది. జనరల్ మోటార్స్, ఇతర సంస్థల విషయంలో ఇలాంటి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. సుంకాల వల్లే ఇదంతా జరిగింది. మనకు కెనడియన్ కార్లు, పరికరాలు సహా ఏమీ వద్దు. కెనడాతో వాణిజ్యంలో అమెరికా ఏటా 60 బిలియన్ డాలర్లుకుపైగా నష్టపోతోంది. దశాబ్దాలుగా ఈ దోపిడీ జరుగుతోంది. ఏనాడో మననుంచి లాగేసుకున్న



వ్యాపారాలన్నీ సుంకాలను తప్పించుకోవడానికి ఇప్పుడు అమెరికాకు బారులు తీరుతున్నాయి. కెనడా పట్ల కఠిన వైఖరిని అవలంబించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని ట్రంప్ విమర్శలు చేశారు. అమెరికా-కెనడా మధ్య వాణిజ్య ఒప్పందం చివరి నిమిషంలో రద్దయింది. అమెరికా ఇప్పటికే 50 శాతం సుంకాలతో విరుచుకుపడగా.. కెనడా సైతం అగ్రరాజ్యంపై తాజాగా ప్రతీకార సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. కెనడియన్ కార్లు, ట్రక్కులు, ఆటోమోటివ్ విడిభాగాలు, ఉక్కు దిగుమతులపై ట్రంప్ 50శాతం టారిఫ్‌లు విధించారు.

చురకలు



# పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జారె



**దమ్మపేట, ఆగష్టు 31,:** ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సోమవారం దమ్మపేట, ములకలపల్లి మండలాలో నిర్వహించిన పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొని శుభాకాంక్షలు ఆశీస్సులు అందించారు. దమ్మపేట మండలం, అంకంపాలెం గ్రామంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పాస్టర్ కాకా రమేష్ సతీమణి మౌనిక శ్రీమంతం వేడుకకు హాజరై ఆశీర్వదించారు. అనంతరం గిరిజన బాలికల ఆశ్రమ కళాశాలలో ప్రిన్సిపాల్ గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన కుక్కల పుల్లమ్మ (మణి) పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యారంగానికి ఆమె అందించిన సేవలను అభినందించి పదవీ విరమణ అనంతరం ఆమె జీవితం సుఖ సంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ములకలపల్లి మండలం రామాంజనేయపురం లో దేవళ్ళ బాలరాజు – విజయమ్మ దంపతుల కుమారుడు చిన్నికృష్ణ, త్రివేణిల వివాహ వేడుకకు హాజరయి నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాలలో ప్రజా ప్రతినిధులు రెండు మండలాల ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



**తొగుట, ఆగస్టు 31,:**
తొగుట మండలంలోని లింగాపూర్ గ్రామంలో బిఆర్ఎస్ నాయకులు తగరం అశోక్ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సోమవారం పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో పాటు దుబ్బాక నియోజకవర్గం ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి నాయకులు బండారు స్వామి గౌడ్, వేల్పుల స్వామి కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కం స్వామి, భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 2న పద్యపఠన పోటీలకు ఎంఈఓకు ఆహ్వానం



**చొప్పదండి/కొడిమ్యాల, ఆగస్టు 31, :**
తెలుగు భాషా ఫోరం జగిత్యాల జిల్లా వారిచే నిర్వహించనున్న పద్య పఠన పోటీలకు కొడిమ్యాల విద్యాధికారికి మండల తెలుగు భాష ఉపాధ్యాయులు సోమవారం ఆహ్వానం పలికారు. తెలుగు భాష సొగసును, రసజ్ఞత, తెలుగుభాష వైభవాన్ని చాటి చెప్పేలా మండల కేంద్రం కొడిమ్యాలలో సెప్టెంబర్ 2 మధ్యానం ప్రభుత్వ హైస్కూల్ లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వహణ బాధ్యులు తెలుగు భాషోపాధ్యాయులు టి. వెంకట రమణ, కె. అనిత, ఏ. శేఖర్ లు తెలిపారు.

# సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

**జగిత్యాల/మెట్‌పల్లి, ఆగష్టు 31, :**



మెట్‌పల్లి పట్టణంలోని 8వ వార్డు వెల్లుల్ల రోడ్డులో రూ.2 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు...

# రైతుబంధు ఆగమైంది.. రైతుబీమా గల్లంతైంది..

- **కేసీఆర్ హయాంలో లేని కష్టాలు ఇప్పుడు రైతులకు ఎందుకు**
- **కాంగ్రెస్ పాలనపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం**



**సిద్దిపేట రూరల్, ఆగస్టు 31,:**
కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో రైతుల కష్టాలు తీరాలంటే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆయన అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం రాంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ హనుమాన్ దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమానికి హరీశ్‌రావు సోమవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి సహకరించిన గ్రామ ప్రజలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ గతంలో చెట్టు కింద ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉన్న ఆంజనేయ స్వామికి గ్రామ ప్రజలు అద్భుతమైన ఆలయాన్ని నిర్మించుకోవడం సంతోషంగా ఉందన్నారు. గ్రామ పెద్దలు రూ.లక్ష విరాళం ఇవ్వగా, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. ప్రభుత్వం మారడంతో బిల్లులు నిలిచిపోయాయని, ఆ నిధులను ఇప్పించేందుకు తాను కృషి చేస్తానన్నారు. ఆలయ ఫ్లోరింగ్ కోసం గ్రానైట్ కూడా పంపించామని, పండుగ అనంతరం పనులు పూర్తి చేస్తామని చెప్పారు. రాంపూర్‌ను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయడంతో పాటు ఓపెన్ జిమ్, డంప్‌యార్డు, వైకుంఠధామం, సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీ భవనం వంటి అభివృద్ధి పనులు చేపట్టామని హరీశ్‌రావు గుర్తుచేశారు. గ్రామానికి అవసరమైన మిగిలిన పనులను కూడా పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. రైతులు లావాణి పట్టాల కోసం కోరగా, తన సొంత ఖర్చుతో మీ సేవలో ఆన్‌లైన్ చేయించి 43 మందికి పట్టాలు ఇప్పించానని తెలిపారు. దీంతో వారికి రైతుబంధు, రైతుబీమా కూడా అందిందన్నారు. మరో పది మందికి లావాణి పట్టాలు రావాల్సి ఉందని, ఈ విషయంపై కలెక్టర్‌తో మాట్లాడానని, వారికి కూడా త్వరలో పట్టాలు వచ్చేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని, కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండేవని, ప్రస్తుతం యూరియా, డీఏపీ కోసం రైతులు రోజుల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని హరీశ్‌రావు విమర్శించారు. కరెంట్ కోసం కూడా రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతుబంధు విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని ఆరోపించారు. కొందరికి రైతుబంధు ఇచ్చి, మరికొందరికి ఇవ్వకుండా జాప్యం చేస్తోందన్నారు. రైతుబీమా పథకం నిలిచిపోయింది రైతు కుటుంబాలకు అండగా నిలిచిన రైతుబీమా పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 14 నుంచి నిలిపివేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. గతంలో రైతు మరణిస్తే రూ.5 లక్షల బీమా సొమ్ము అందేదని, రాంపూర్ గ్రామంలోనే ఐదుగురు రైతు కుటుంబాలకు ఈ ప్రయోజనం లభించిందని తెలిపారు. కేసీఆర్ హయాంలో 57 ఏళ్లకే వృద్ధాప్య పింఛన్లు, బీడీ కార్మికులకు పింఛన్లు అందించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లలో కొత్తగా ఒక్కరికీ పింఛన్ ఇవ్వలేదని, ఎన్నికల్లో హామీ ఇచ్చిన రూ.4 వేల పింఛన్‌ను అమలు చేయడం లేదని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. ఆసుపత్రుల్లో బాలింతలకు అందించే కేసీఆర్ కిట్‌ను కూడా నిలిపివేశారని ఆరోపించారు. ఆడబిడ్డల వివాహాలకు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. రాంపూర్ గ్రామ ప్రజలు ఎప్పుడూ ఐకమత్యంతో ఉంటారని, గ్రామం అంటే తనకు, కేసీఆర్‌కు ఎంతో ఇష్టమని హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఒక్కొక్కటిగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోతున్నాయని విమర్శించారు. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో పయనించాలంటే, ప్రజలు మరియు రైతుల కష్టాలు తీరాలంటే కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని హరీశ్‌రావు ఆకాంక్షించారు. సీతారామచంద్ర స్వామి, ఆంజనేయ స్వామి ఆశీస్సులతో తెలంగాణలో మళ్లీ మంచి రోజులు వస్తాయని అన్నారు.

# బాచుపల్లి ఎల్లమ్మ దేవాలయం వద్ద నూతన సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగష్టు 31,:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి పరిధిలోని శ్రీ శ్రీ శ్రీ ఎల్లమ్మ దేవాలయం వద్ద నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. ఎల్లమ్మ దేవాలయానికి వచ్చే భక్తులు, స్థానిక ప్రజలు



రాకపోకల్లో ఇబ్బందులు ఎదుర్కొనకుండా నూతన సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ప్రజల అవసరాలను గుర్తించి, స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని హన్మంత్ రెడ్డి తెలిపారు. నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభం కావడంతో బాచుపల్లి గ్రామ పెద్దలు, కాలనీ సభ్యులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాచుపల్లి గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ సభ్యులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటయ్య కుటుంబానికి అండగా ఉంటాం

- **తొగుట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంది రాజు**
- **బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన పంది రాజు**

**తొగుట, ఆగస్టు 31,:**
తొగుట మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన వడ్ల వెంకటయ్య ఇటీవల మృతి చెందారు. కాగా బాధిత కుటుంబాన్ని తొగుట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంది రాజు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, వెంకటయ్య మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వెంకటయ్య కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న పంది రాజు, బాధిత కుటుంబానికి రూ.3వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటయ్య కుటుంబానికి గతంలోనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయగా, ఇటీవలే ఇల్లు పూర్తయిందని తెలిపారు. అయితే, ఎంతో ఆశగా ఎదురుచూసిన ఆ ఇంట్లో వెంకటయ్య ఒక్క రోజు కూడా నివసించలేక పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టకాలంలో ఉన్న వెంకటయ్య కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పంది రాజు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండారు రమేష్ గౌడ్, నాయకులు వడ్డే



కిష్టయ్య, వోలపు సత్యనారాయణ, మిద్దె స్వామి, జంగపల్లి ఆంజనేయులు, కల్లేపు భాను చందర్, పోతరాజు రవీందర్, వడ్డే నర్సింలు, సింగోజీ మహేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ముత్తిన శివ రామకృష్ణ ను సన్మానించిన మెచ్చా

**దమ్మపేట, ఆగష్టు 31,:** తుంబూరు గ్రామానికి చెందిన ప్రముఖ సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్ ముత్తిన శివ రామకృష్ణ తెలుగింటి కుర్రోడు కు గాను ఆంధ్రప్రదేశ్ – తెలంగాణ రాష్ట్ర స్థాయి ఉత్తమ నటుడు, ఉత్తమ దర్శకుడు అవార్డులు అందుకున్న సందర్భంగా అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తన స్వగ్రామం తాటి సుబ్బన్నగూడెం లో వారి నివాసంలో సోమవారం ఘనంగా సన్మానించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ 85 వేల ఇన్స్టాగ్రామ్ ఫాలోవర్స్ కల్గిన శివ రామకృష్ణ కొనియాడారు. నేటి యువతలో ఎంతో ప్రతిభ ఉందని సరైన ప్రోత్సాహం లభిస్తే మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించగలరు అన్నారు.




గ్రామీణ ప్రాంతం నుంచి ఎదిగి తన ప్రతిభతో నటుడిగా, దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు సాధించడం ఎంతో అభినందనీయం అని కొనియాడారు. "తెలుగింటి కుర్రోడు"గా ప్రేక్షకుల ఆదరణ పొందుతున్న ముత్తిన శివ రామకృష్ణ, కేవలం వినోదానికే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడే సందేశాత్మక వీడియోలను రూపొందిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నం చేయడం విశేషం అన్నారు. తన వీడియోల ద్వారా మంచి సందేశాలను సమాజానికి చేరవేస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని మెచ్చా ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల్లో ఉత్తమ నటుడు, ఉత్తమ దర్శకుడు అవార్డులు అందుకోవడం ఆయన ప్రతిభకు దక్కిన గొప్ప గుర్తింపు అని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి తెలుగు రాష్ట్రాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు అండగా ఉంటుంది

## ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**జగిత్యాల ప్రతినిధి, ఆగష్టు 31, :**
జగిత్యాల జిల్లా యూట్యూబర్స్ కళాకారుల బోనాల జాతర వర్కింగ్ కమిటీ వారి ఆధ్వర్యం లో ఇటీవల నిర్వహించిన బోనాల జాతర 2026 కార్యక్రమం విజయవంతం కాగా సోమవారం జగిత్యాల బిఎల్ఎన్ గార్డెన్స్ లో వారి ఆహ్వానం మేరకు బోనాల జాతర విజయోత్సవ వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య. ఈ కార్యక్రమంలో సింగర్ మల్లిక్ తేజ, సేవాదళ్ అధ్యక్షులు ముకేష్ ఖన్నా, జగిత్యాల జిల్లా యూట్యూబర్స్ కళాకారుల



ఐక్య వేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీ యువతకు ఉచిత గ్రూప్ ఉద్యోగాల కోచింగ్

- సెప్టెంబర్ 15 నుంచి తరగతులు ప్రారంభం
- 14లోపు దరఖాస్తుల సమర్పణ



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 31,:**
మైనారిటీ వర్గాలకు చెందిన విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ అందించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి డి నాగరాజమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, పార్సీలు, జైనులు, బౌద్ధ మైనారిటీ వర్గాలకు చెందిన యువత కోసం గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 ఉద్యోగాల నియామక పరీక్షలకు జనరల్ స్టడీస్ ఫౌండేషన్ కోర్సు కింద శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ఈ ఉచిత కోచింగ్ మంచి అవకాశమని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ లక్ష్యాలను సాధించాలని కోరారు. భవిష్యత్తులో నిర్వహించనున్న గ్రూప్-1, 2, 3, 4 ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలకు అభ్యర్థులు సమర్థవంతంగా సిద్ధమయ్యేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే జనరల్ స్టడీస్‌లో ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 14లోపు దరఖాస్తు ఆసక్తి ఉన్న మైనారిటీ వర్గాలకు చెందిన విద్యావంతులైన యువత సెప్టెంబర్ 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు సమర్పించాలని, దరఖాస్తుతో పాటు ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ మెమోలు, ఒక పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్ కార్డు, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకురావాలని అధికారులు సూచించారు. దరఖాస్తులను తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ కార్యాలయం, ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ కాలేజీ ప్రాంగణం, నాంపల్లి, హైదరాబాద్‌లో సమర్పించవచ్చని, కోచింగ్ తరగతులు సెప్టెంబర్ 15, 2026 నుంచి ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం కార్యాలయ వేళల్లో 040-23236112, 9059050062 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అందుబాటులో ఉన్న ఇమెయిల్ ద్వారా కూడా వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- మహిళలు, బాలికలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి







**చేర్యాల రూరల్, ఆగస్టు 31,:**
మహిళలు, బాలికలు తమ హక్కులు, చట్టపరమైన రక్షణలు, అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థలపై అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ కమిషనర్ పద్మజా రమణ సూచించారు. మహిళా కమిషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ సిద్దిపేట, సంబంధిత శాఖల సమన్వయంతో చేర్యాల కేజీబీవీ పాఠశాలలో సోమవారం మహిళలు, బాలికలు, విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మజా రమణ మాట్లాడుతూ మహిళా కమిషన్ ఏర్పాటు, లక్ష్యాలు, విధుల గురించి వివరించారు. మహిళలు తమ సమస్యలు, ఇబ్బందులు, ఫిర్యాదులను కమిషన్ దృష్టికి తీసుకురావచ్చని అన్నారు. అవసరమైన సందర్భాల్లో కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు సంబంధిత శాఖలకు తదుపరి చర్యల కోసం సిఫారసులు చేస్తామని తెలిపారు. మహిళల హక్కులు, రక్షణకు సంబంధించిన స్వయంప్రేరిత కేసులను కూడా కమిషన్ స్వీకరిస్తుందని చెప్పారు. మహిళల హక్కులను పరిరక్షించేందుకు అవసరమైన చట్టాల రూపకల్పన, చట్టాల బలోపేతం, అవగాహన కార్యక్రమాల నిర్వహణలో మహిళా కమిషన్ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. జిల్లా సంక్షేమ అధికారి శారద మాట్లాడుతూ మహిళలు, బాలికల భద్రత, రక్షణ, సంక్షేమం కోసం వివిధ శాఖల మధ్య సమన్వయం ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోక్సో చట్టం, గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాము విద్యార్థులకు పోక్సో చట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్లలో వయోజనుల కోసం ఉద్దేశించిన కంటెంట్ చూడటం వల్ల కలిగే దుష్ప్రభావాలు, ఆన్‌లైన్‌లో ఎదురయ్యే ప్రమాదాల గురించి వివరించారు. పిల్లలను లైంగిక వేధింపులు, దుర్వినియోగం, దోపిడీ నుంచి రక్షించేందుకు పోక్సో చట్టం కల్పించే రక్షణలను వివరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, వాటి నివారణకు సంబంధించిన చట్టపరమైన అంశాలను తెలియజేశారు. మహిళలకు సహాయం కోసం 181 హెల్ప్‌లైన్ గురించి వివరించారు. ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన డాక్టర్ హరిత రెడ్డి విద్యార్థులకు ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, కౌమార బాలికల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, పోషకాహారం ప్రాధాన్యత, బాలికల్లో రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓలు భారతి, సుల్తానా, సునీత, మహిళా కమిషన్ కౌన్సిలర్ కవిత, చేర్యాల ఎంఈఓ బి. రవీందర్, మున్సిపల్ చైర్మన్ ముస్త్యాల అరుణ, 3వ వార్డు కౌన్సిలర్ కొమ్ము రాజేశ్వరి, సీడీపీఓ రమాదేవి, మెడికల్ ఆఫీసర్ హరిత రెడ్డి, చేర్యాల ఎస్సై అపూర్వ రెడ్డి, సైబర్ క్రైమ్ ఎస్సై దివ్య, జిల్లా జెండర్ అండ్ ఈక్విటీ కోఆర్డినేటర్ డి నర్మద, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కృష్ణవేణి, షీ టీమ్స్ స్వప్న, ఉమెన్ హబ్ ఇన్‌చార్జి కోఆర్డినేటర్ శ్వేత, సోషల్ వర్కర్ అనిత, నాగరాజు, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ ప్రసాద్, కనకరాజు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కేజీబీవీ, మోడల్ స్కూల్‌కు చెందిన సుమారు 350 మంది విద్యార్థినులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- స్పందించే ము కోండి.. మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి..
- సీపీ సాధన రష్మీ పెరుమాళ్



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 31,:**
ఇటీవలి కాలంలో విపరీతంగా పెరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్, సూచించారు. సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల్లో ప్రజలను మోసం చేస్తూ వారి కష్టార్జితాన్ని దోచుకుంటున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ, ఏటీఎం పిన్, సీవీవీ, పాస్‌వర్డ్‌లు, యూపీఐ పిన్ వంటి బ్యాంకింగ్ వివరాలను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయకూడదని, 'కలెక్ట్ రిక్వెస్ట్'లను అంగీకరించవద్దని పేర్కొన్నారు. తమ ఖాతాలోకి డబ్బు జమ కావడానికి యూపీఐ పిన్ నమోదు చేయాల్సిన అవసరం లేదనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. బ్యాంకులు, యూపీఐ వేదికలు, టెలికాం సంస్థల పేరుతో వచ్చే నకిలీ కేవైసీ అప్‌డేట్ సందేశాలు, ఫోన్‌కాల్స్‌ను నమ్మవద్దని తెలిపారు. అనుమానాస్పద లింకులు, నకిలీ వెబ్‌సైట్లు, ఈమెయిళ్లను తెరవడం ద్వారా వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు నేరగాళ్లకు చేరే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బ్యాంకు అధికారులు, పోలీసులు, ప్రముఖ సంస్థల ప్రతినిధులమని చెప్పే అనుమానాస్పద కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నకిలీ ఆఫర్లు, బహుమతులు, అధిక లాభాల పేరుతో వచ్చే సందేశాలను నమ్మవద్దని, నకిలీ స్టాక్ మార్కెట్, పెట్టుబడి వేదికల్లో అధిక లాభాల ఆశతో డబ్బులు పెట్టి మోసపోవద్దని సీపీ సూచించారు. ఇన్‌స్టంట్ లోన్ పేరుతో వచ్చే నకిలీ యాప్‌లు, ముందస్తు రుసుము మోసాలు, బ్లాక్‌మెయిలింగ్, వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉద్యోగాల పేరుతో రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్, కన్సల్టెన్సీ ఫీజులు అడిగే నకిలీ ప్రకటనలను నమ్మవద్దని తెలిపారు. తక్కువ ధరకు నాణ్యమైన ఉత్పత్తులు ఇస్తామంటూ ముందస్తు చెల్లింపులు చేయించుకునే మోసాల పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఓఎల్ఎక్స్ వంటి ఆన్‌లైన్ వేదికల్లో కొనుగోలుదారులు, విక్రేతల పేరుతో పంపే క్యూఆర్ కోడ్‌లు, యూపీఐ అభ్యర్థనల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో తమ పేరుతో లేదా మిత్రుల పేరుతో నకిలీ ఖాతాలు సృష్టించి డబ్బులు అడిగే అవకాశముందని, అలాంటి అభ్యర్థనలకు స్పందించే ముందు సంబంధిత వ్యక్తిని నేరుగా సంప్రదించి నిర్ధారించుకోవాలని తెలిపారు. పోలీసులు, సీబీఐ, ఈడీ లేదా న్యాయస్థానాల అధికారులమంటూ వీడియో కాల్స్ చేసి భయపెట్టి డబ్బులు వసూలు చేసే మోసాల పట్ల ప్రత్యేకంగా అప్రమత్తంగా ఉండాలని సీపీ రష్మీ పెరుమాళ్ సూచించారు. భారతీయ చట్టాల్లో 'డిజిటల్ అరెస్ట్' అనే భావన లేదా చట్టం లేదని స్పష్టం చేశారు. "అప్రమత్తంగా ఉండండి.. స్పందించే ముందు నిర్ధారించుకోండి.. అనుమానం వస్తే ఫిర్యాదు చేయండి" అని సీపీ ప్రజలకు సూచించారు. సైబర్ మోసానికి గురై ఆర్థికంగా నష్టపోతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. సైబర్‌క్రైమ్. గవర్నమెంట్. ఇన్లో ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. మోసానికి గురైన వెంటనే, ముఖ్యంగా 'గోల్డెన్ అవర్'లో ఫిర్యాదు చేస్తే, మోసపోయిన మొత్తాన్ని నిలిపివేయడం లేదా రికవరీ చేసే అవకాశం మరింత ఎక్కువగా ఉంటుందని సీపీ సాధన రష్మీ పెరుమాళ్ పేర్కొన్నారు.

# మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్ కోసం ఎంపీకి వినతి

- సానుకూలంగా స్పందించిన ఎంపీ రఘునందన్ రావు
- కళాశాల సందర్శనకు హామీ

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 31,:**
స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు హాస్టల్ వసతి కల్పించాలని కోరుతూ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి జీవన్ కుమార్ ఆధ్వర్యంలో కళాశాల సిబ్బంది సోమవారం మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావును కలిసి వినతిపత్రం సమర్పించారు. 2026-27 విద్యా సంవత్సరంలో కళాశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడంతో తరగతి గదులతో పాటు ఇతర మౌలిక వసతుల అవసరం ఏర్పడిందని వారు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుకుంటున్న మహిళా విద్యార్థినులకు హాస్టల్ వసతి అత్యవసరంగా ఉందని వివరించారు. విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని హాస్టల్ వసతి కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు. దీనిపై రఘునందన్ రావు సానుకూలంగా స్పందించి, కళాశాలను స్వయంగా సందర్శించి సమస్యలను పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ సానుకూలంగా స్పందించి కళాశాల సందర్శనకు హామీ ఇవ్వడంపై ప్రిన్సిపల్ డాక్టర్ జి జీవన్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ సువర్ణాదేవి తదితర కళాశాల సిబ్బంది



ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# క్యాన్సర్ బాధితుడికి ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆర్థిక సాయం

## రిటైర్డ్ ఉద్యోగి శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే ప్రశంస.!



**జగిత్యాల ప్రతినిధి, ఆగస్టు 31, :**
ఆరోగ్య పరిరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని, గుట్కా, తంబాకు వంటి ప్రాణాంతక అలవాట్లకు దూరంగా ఉండాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణానికి చెందిన విశ్రాంత ఉద్యోగి శ్రీనివాస్ దాతల సహకారంతో సమకూర్చిన రూ.40,000 ఆర్థిక సాయాన్ని సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డాక్టర్ సంజయ్ కుమార్ చేతుల మీదుగా క్యాన్సర్ బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూకపల్లికి చెందిన రాజ్‌కుమార్ అనే వ్యక్తి నోటి క్యాన్సర్‌తో బాధపడుతూ, పీఈటీ (పిఈటి) స్కాన్ తదితర వైద్య పరీక్షల ఖర్చులకు కూడా తీవ్ర ఇబ్బంది పడుతున్న పరిస్థితిని గుర్తించిన విశ్రాంత ఉద్యోగి శ్రీనివాస్ చొరవ తీసుకున్నారని తెలిపారు. దాతల సహకారంతో పాటు తను కొంత మొత్తం కలిపి రూ.40,000 జమ చేసి, తన చేతుల మీదుగా బాధితుడికి ఇప్పించడం చాలా అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. వైద్యం ఎంతో ఖరీదైనదవుతున్న ఈ రోజుల్లో, గుట్కా, తంబాకు నమలడం వల్లనే నోటి క్యాన్సర్లు విపరీతంగా పెరుగుతున్నాయని ఒక డాక్టర్‌గా ప్రజలను హెచ్చరించారు. ఆపదలో ఉన్న బాధితుడిని ఆదుకునేందుకు ముందుకొచ్చిన విశ్రాంత ఉద్యోగి శ్రీనివాస్ కి, సహకరించిన దాతలందరికీ ఎమ్మెల్యే ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# జల్దా రాఘవులు విగ్రహాన్ని ప్రతిష్ఠిద్దాం

## గాంధీనగర్ వాసుల ఏకగ్రీవ తీర్మానం



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 31 ::**
మాజీ పంచాయతీ సభ్యులు, గాంధీనగర్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, కీర్తిశేషులు జల్దా రాఘవులు విగ్రహాన్ని గాంధీనగర్ ప్రాంతంలో ప్రతిష్ఠించాలని స్థానిక బస్తీవాసులు, నాయకులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సోమవారం రాఘవులు కుమారుడు, స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు జల్దా లక్ష్మీనాథ్ ఆధ్వర్యంలో పోచమ్మ ఆలయ ప్రాంగణంలో రాఘవులు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు పాల్గొని రాఘవులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు మాట్లాడుతూ జల్దా రాఘవులు గాంధీనగర్ ప్రాంతానికి చేసిన సేవలను కొనియాడారు. సమాజ సేవకుడిగా, మానవతావాదిగా ఆయన ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందారని గుర్తుచేసుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన ఆయన సేవలను చిరస్థాయిగా గుర్తుంచుకునేందుకు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు, సీనియర్ నాయకులు ఖాజా మియా, రంగా శ్రీనివాస్ గౌడ్, మేకల ఎల్లయ్య, మీసాల సత్యనారాయణ, బండారి సాయి కుమార్, వాజీద్, బాలయ్య, రాములు తదితరులతో పాటు యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

## ఎస్ఐ వినయ్ కుమార్

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



**జహీరాబాద్ ప్రతినిధి, ఆగస్టు 31,:**
సైబర్ నేరాలపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఆన్లైన్ మోసాలు, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జహీరాబాద్ ఎస్ఐ వినయ్ కుమార్ సూచించారు. జహీరాబాద్ రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో రంజోల్ గ్రామంలోని టీజీఎస్డబ్ల్యూ ఆర్ఈఐఎస్ పాఠశాలలో సైబర్ నేరాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా మోసాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎవరితోనూ ఓటీపీ, పిన్, పాస్‌వర్డ్, బ్యాంక్ వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని సూచించారు. తెలియని లింకులను క్లిక్ చేయకుండా, సోషల్ మీడియాను జాగ్రత్తగా ఉపయోగించాలని విద్యార్థులకు సూచించారు. ఆన్‌లైన్ ఆర్థిక మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

చురకలు



# కార్యకర్త కుటుంబాలకు అండగా ఉంటాం

- **అన్వర్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**

**తొగుట, ఆగస్టు 31:**
పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి భరోసా ఇచ్చారు. తొగుట మండలం ఎల్లారెడ్డిపేటకు చెందిన బీఆర్ఎస్ క్రియాశీల కార్యకర్త మహ్మద్ అన్వర్ హుస్సేన్ ఇటీవల ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సోమవారం ఎల్లారెడ్డిపేటలోని అన్వర్ కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అన్వర్ బీఆర్ఎస్ లో క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలిపారు. కార్యకర్తలే పార్టీకి బలం అని పేర్కొన్న ఎమ్మెల్యే, అన్వర్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు భవిష్యత్తులోనూ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తొగుట మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వేల్పుల స్వామి, గ్రామ అధ్యక్షులు నందారం వెంకటేష్ గౌడ్, నాయకులు బోధనం కనకయ్య, బండారు స్వామి గౌడ్, కర్ణాకట్ రెడ్డి, జహంగీర్, నీరజ్, అహ్మద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



- **వోక్షిత్ హిల్ వ్యూ కాలనీ అభివృద్ధికి ప్రతి అండగా ఉంటా: మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 31,:**
మహాదేవపురం డివిజన్ పరిధిలోని వొక్షిత్ హిల్ వ్యూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నరేష్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు సోమవారం కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న పలు సమస్యలను వారు మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా అంతర్గత రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ సమస్యలు తదితర అంశాలను వివరించి, వాటి పరిష్కారానికి సహకరించాలని కోరారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ అధ్యక్షుడు నరేష్ రెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులందరికీ అభినందనలు తెలిపారు. కాలనీ అభివృద్ధి, సంక్షేమం కోసం అసోసియేషన్ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కాలనీలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వం తరపున కాలనీ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ చైర్మన్ సోమిరెడ్డి, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, అరుణ, ప్రధాన కార్యదర్శి రామనాయుడు,టి. నరేష్ కుమార్, కోశాధికారి శ్రీధర్ గౌడ్, కార్యవర్గ సభ్యులు సురేందర్, శివ, ఆనంద్, ప్రతాప్ గౌడ్, స్మృతిరంజన్, రవితేజ, నవీన్ కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

- **జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ఆగష్టు 31, :**
శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల (సెప్టెంబర్ 1వ తేది నుండి 30 వరకు) పాటు జగిత్యాల జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరదాని, నిబంధనలకు విరుద్ధిదంగా డిజే వినియోగించారాదని తెలిపారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

# సెల్‌ఫోన్‌కు బానిస కావొద్దు.. ఆటలతో మెదడుకు పదును..

- **చెస్ వంటి ఆటలు ఆలోచనా శక్తిని, చురుకుదనాన్ని పెంచుతాయి**
- **విద్యార్థులు భోజనం చేసేటప్పుడు సెల్‌ఫోన్ చూడొద్దు**
- **మాజీ మంత్రి హరీశ్‌రావు**



**సిద్దిపేట రూరల్, ఆగస్టు 31,:**
నేటి ఆధునిక కాలంలో సెల్‌ఫోన్ వినియోగం పిల్లల్లో వ్యసనంగా మారడం ఆందోళన కలిగించే విషయమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు అన్నారు. అవసరానికి అనుగుణంగా మొబైల్ ఫోన్‌ను ఉపయోగించుకోవాలే తప్ప, దానికి మనం బానిసలుగా మారకూడదని విద్యార్థులకు సూచించారు. ఫుట్‌బాల్, వాలీబాల్, క్రికెట్ వంటి బహిరంగ క్రీడలతో పాటు చెస్ వంటి మేధో క్రీడలకు కూడా విద్యార్థులు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. సిద్దిపేటలోని మెరిడియన్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌కు హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై, పోటీల్లో పాల్గొన్న సుమారు 168 మంది విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సరదాగా ముచ్చటిస్తూ సెల్‌ఫోన్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, క్రీడల ప్రాధాన్యతను వారికి వివరించారు.

### భోజనం చేసేటప్పుడు ఫోన్ చూడొద్దు

ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రస్తుతం చాలా మంది పిల్లలకు సెల్‌ఫోన్ ఒక వ్యసనంగా మారిపోయిందని అన్నారు. భోజనం చేసేటప్పుడు కూడా ఫోన్ చూడకుండా ముద్ద మింగలేని పరిస్థితి ఏర్పడటం ఆందోళనకరమన్నారు. ఇటీవల ఓ ఆస్పత్రి ప్రారంభోత్సవానికి వెళ్లిన సమయంలో ఏడాదిన్నర వయసున్న చిన్నారి సెల్‌ఫోన్‌కు తీవ్రంగా అలవాటుపడిన విషయాన్ని గమనించానని తెలిపారు. "అవసరానికి మొబైల్ వాడుకోవాలి. కానీ మొబైల్‌కు మనం లొంగిపోవద్దు. మొబైల్ మనకు బానిస కావాలి కానీ, మనం మొబైల్‌కు బానిస కావొద్దు" అని విద్యార్థులకు సూచించారు. పిల్లలు గంటల తరబడి సెల్‌ఫోన్లతో గడపడం వల్ల సృజనాత్మకత, ఆలోచనా శక్తి, చురుకుదనం తగ్గే అవకాశం ఉంటుందని అన్నారు. అందువల్ల ఫోన్లను పక్కన పెట్టి మైదానంలో ఆటలు ఆడాలని సూచించారు. చెస్ జీవితానికి పాఠం చెస్ వంటి ఆటలు మెదడుకు పదును పెడతాయని హరీశ్‌రావు అన్నారు. చెస్‌లో రాజు, మంత్రి, ఏనుగు, బంటు వంటి ప్రతి పావుకు ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. సరైన సమయంలో సరైన ఎత్తు వేస్తే చిన్న బంటు కూడా రాజుకు చెక్ పెట్టగలదని చెప్పారు. చెస్‌లో వేసే ప్రతి అడుగు ఎంతో కీలకమని, అదే విధంగా జీవితంలో కూడా ప్రతి నిర్ణయం భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని అన్నారు. ఎదుటివారి వ్యూహాలను అంచనా వేయడం, ముందుచూపుతో నిర్ణయాలు తీసుకోవడం, సరైన సమయంలో సరైన అడుగు వేయడం వంటి లక్షణాలను చెస్ నేర్పుతుందని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడలు, ఆరోగ్యం కూడా విద్యార్థుల జీవితంలో సమానంగా ముఖ్యమన్నారు. ఆటల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించే అలవాటు జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని ఇస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదే బాధ్యత పిల్లలను సెల్‌ఫోన్ వ్యసనం నుంచి దూరంగా ఉంచడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని హరీశ్‌రావు సూచించారు. విద్యార్థులు భోజనం చేసేటప్పుడు సెల్‌ఫోన్ చూడకుండా ఉంటామని తమకు తామే మాట ఇవ్వాలని కోరారు. "భోజనం చేసేటప్పుడు సెల్‌ఫోన్ చూడకుండా ఉంటామని మీ మీద మీరే ఒట్టేసుకుని నాకు ప్రామిస్ చేయండి. రేపు స్కూల్ డేకు నేను వచ్చినప్పుడు మీ మమ్మీ, డాడీని అడిగి తెలుసుకుంటాను" అంటూ విద్యార్థులను ఉత్సాహపరిచారు. అఖిల చదువు బాధ్యత నాదే మెరిడియన్ స్కూల్‌లో చదివిన అఖిల అనే పేద విద్యార్థిని ఎంబీబీఎస్ సీటు సాధించి సిద్దిపేట మెడికల్ కాలేజీలో చేరడం అభినందనీయమని హరీశ్‌రావు అన్నారు. ఆమెను నాలుగేళ్ల పాటు చదివించిన మెరిడియన్ స్కూల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అఖిల ఎంబీబీఎస్ విద్యను పూర్తిచేసే వరకు, ఐదేళ్లపాటు ఆమె చదువుకు అయ్యే పూర్తి ఖర్చుల బాధ్యతను తాను తీసుకుంటున్నట్లు ప్రకటించారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. గజ్వేల్‌లో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు 2026లో గజ్వేల్‌లో రాష్ట్ర స్థాయి చెస్ ఛాంపియన్‌షిప్ నిర్వహించనున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. ఈ పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు తన సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను అద్భుతంగా నిర్వహించిన మెరిడియన్ స్కూల్ యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి సిద్దిపేటకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



# మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో యువత క్రీడల్లో రాణించాలి

- **సిద్దిపేట మున్సిపల్ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 31,:**
మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను చాటాలని సిద్దిపేట మున్సిపల్ అధికారులు పిలుపునిచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా పోటీలను నిర్వహించి తమ ప్రతిభను ప్రదర్శించారు.మేజర్ ధ్యాన్‌చంద్ దేశానికి, భారత క్రీడారంగానికి అందించిన సేవలను అధికారులు, సిబ్బంది స్మరించుకున్నారు. ఆయన జన్మదినమైన ఆగస్టు 29ను భారత ప్రభుత్వం జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహిస్తోందని తెలిపారు. భారత హాకీ రంగంలో మేజర్ ధ్యాన్‌చంద్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. 1928, 1932, 1936 ఒలింపిక్ క్రీడల్లో భారత హాకీ జట్టు వరుసగా మూడు స్వర్ణ పతకాలు సాధించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. మేజర్ ధ్యాన్‌చంద్ ప్రతిభ, క్రమశిక్షణ, అంకితభావం నేటి తరానికి ఆదర్శమని అన్నారు. యువత విద్య, ఉద్యోగాలతో పాటు క్రీడలపైనా దృష్టి సారించాలని సూచించారు. ప్రతిరోజూ వ్యాయామం, క్రీడలకు కొంత సమయం కేటాయించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ స్వయంగా క్రీడల్లో పాల్గొని సిబ్బందిని ఉత్సాహపరిచారు. ఏఈ పృధ్వి




బౌలింగ్ చేయగా, కమిషనర్ మల్లికార్జున్ బ్యాటింగ్ చేసి సందడి చేశారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలకు కమిషనర్ మల్లికార్జున్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.

# మర్డర్, పోక్సో కేసుల్లో నిందితుడికి డబుల్ జీవిత ఖైదు

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 31,:**
మర్డర్, పోక్సో కేసుల్లో నిందితుడికి న్యాయస్థానం డబుల్ జీవిత కఠిన కారాగార శిక్ష విధించింది. సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో బోలో రామ్ హరిజన్ సోనూకు మర్డర్ కేసులో జీవితకాల కఠిన కారాగార శిక్ష, పోక్సో కేసులోనూ జీవితకాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి వై జయ ప్రసాద్ తీర్పు వెల్లడించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ ఘటనపై ఫిర్యాదు అందడంతో 2025 మార్చి 1న సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ దర్యాప్తు చేపట్టి, సమగ్రంగా విచారణ నిర్వహించారు. కేసుకు సంబంధించిన పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి పటిష్టమైన ఛార్జిషీట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేశారు. కేసు విచారణ సందర్భంగా ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదుల ఆత్మారాములు న్యాయస్థానంలో వాదనలు వినిపించారు. ప్రస్తుత టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం మురళీ, కోర్టు మానిటరింగ్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, లైజనింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, టూ టౌన్ కోర్టు సీడీఓ లింగారెడ్డి, భరోసా న్యాయ అధికారి సౌమ్య సమన్వయంతో కేసు విచారణకు సహకరించారు. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, ఇతర ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారించింది. మర్డర్ కేసులో జీవితకాల కఠిన కారాగార శిక్ష, పోక్సో కేసులోనూ జీవితకాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేసి, కేసు విచారణలో కీలకంగా పనిచేసిన అధికారులు, సిబ్బందిని సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మి పెరుమాళ్ అభినందించారు.



# రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ హేయమైన చర్య

- **జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సత్యప్రసన్న రెడ్డి**
- **డీసిసి నిరసనలో నాయకులతో కలిసి పాల్గొన్న సత్యప్రసన్న**

**కరీంనగర్ ప్రతినిధి, ఆగష్టు 31, :**
హల్ద్వానీలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేపై బీజేపీ– ఆర్ఎస్ఎస్ మూకలు చేసిన కులతత్వ శుద్ధీకరణ చర్యను ఖండించినందుకు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్ లోని హల్ద్వానీ పోలీస్ స్టేషన్ లో బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా ఎఫ్ఐఆర్ నమోదును ఖండిస్తూ సోమవారం దీనిని తీవ్రంగా ఖండిస్తూ సోమవారం కరీంనగర్ డీసిసి కార్యాలయం ఎదుట జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొన్న కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి అసలు దోషులైన బీజేపీ కార్యకర్తలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



# 22ఏ జీవో రద్దు చేయాల్సిందే

## బీజేపీ నేతల డిమాండ్

- సిద్దిపేటలో బీజేపీ మహాధర్నా



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 31,:**
22ఏ నిషేధిత జాబితా నుంచి రైతుల భూములను తొలగించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ హాజరై ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. సిద్దిపేట నుండి హైదరాబాద్ అసెంబ్లీ వరకు పాదయాత్ర చేస్తామని హెచ్చరించారు.

### రైతుల ఉసురు పోసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎంపీ మాధవనేని రఘునందన్ రావు

22ఏ నిషేధిత జాబితా పేరుతో పేద రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం వేధిస్తోందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ కింద పోయిన భూములను సైతం 22ఏలో చేర్చి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. చిన్న సమస్య ఉన్న భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూములు 22ఏలో ఉన్నాయని చెబుతున్నారని, సామాన్య రైతులకు ఒక న్యాయం, ప్రభుత్వ పెద్దలకు మరో న్యాయమా అని ప్రశ్నించారు. 22ఏ నుంచి తొలగించేందుకు దరఖాస్తు అవసరమని ప్రభుత్వం చెబుతుంటే, ప్రభుత్వ పెద్దల భూములను ఏ దరఖాస్తు ఆధారంగా తొలగించారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. 22ఏ సమస్యను పరిష్కరించక పోతే సిద్దిపేట కలెక్టరేట్ నుంచి అసెంబ్లీ వరకు పాదయాత్ర చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరుగుతోందని, రానున్న రోజుల్లో ఆ పార్టీ ఖాళీ అవుతుందని అన్నారు.

### లక్షలాది ఎకరాలను 22ఏలో పెట్టారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు

సిద్దిపేట వంటి ప్రాంతాల్లో లక్షలాది ఎకరాల భూములను 22ఏ జాబితాలో చేర్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఆరోపించారు. ప్రభుత్వం సంక్షేమం కోసం పనిచేయాలి కానీ ప్రజలను భయపెట్టే విధంగా వ్యవహరించకూడదన్నారు. సర్వే నంబర్లను 22ఏలో చేర్చిన వ్యవహారంపై సమగ్ర న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను విక్రయించడంపై అభ్యంతరం లేదని, అయితే పేదల భూములను నిషేధిత జాబితాలో చేర్చి అన్యాయం చేయడం సరికాదన్నారు. భూభారతి ద్వారా అవినీతి పెరిగిందని ఆరోపించారు. బీజేపీ ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు.

### భూభారతి పేరుతో భూములు లాక్కుంటున్నారు నిజామాబాద్ ఎంపీ అరవింద్..

గత ప్రభుత్వంలో ధరణి పేరుతో సమస్యలు వచ్చాయని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకావడం లేదని విమర్శించారు. రాష్ట్ర ఖజానా ఖాళీ అవుతున్నా దాన్ని ఎలా నింపాలో ప్రభుత్వానికి స్పష్టత లేదన్నారు. ఖజానాను నింపడం కంటే ఇతర ప్రయోజనాలపై దృష్టి పెడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవడంలో కాంగ్రెస్ వెనుకడుగు వేస్తోందని, నిజంగా అవినీతి జరిగితే సీబీఐ విచారణకు ఎందుకు అప్పగించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. 22ఏ సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్, సీనియర్ నాయకులు గంగాడి మోహన్ రెడ్డి, దూది శ్రీకాంత్ రెడ్డి, చొప్పదండి విద్యాసాగర్, జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, పట్టణ అధ్యక్షులు బాసంగారి వెంకట్, సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు టేకులపల్లి బాల్ రెడ్డి, కిష్టమ్మగారి సుభాష్ రెడ్డి, తొడుపునూరి వెంకటేశం, కొత్తపల్లి వేణుగోపాల్, మాచర్ల కుమారస్వామి గౌడ్, కట్ట భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శులు నాతి మల్లేష్ ముదిరాజ్, ఖమ్మం వెంకటేశం, బురెడ్డిగారి విభీషణ్ రెడ్డి, కార్యదర్శులు పైడిపల్లి పృధ్విరాజ్, వాసర యాదమల్లు, మారటి బాబు, మడసు వెంకట్ గౌడ్, జాలిగం సురేష్, గిరి జ్యోతి రెడ్డి, కోశాధికారి శ్రీరామ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.







# దుబ్బాకలో మారిన రాజకీయ వాతావరణం

- ఒకే వాహనంలో ఎమ్మెల్యే, ఎంపీ
- నియోజకవర్గ అభివృద్ధి కోసం ఒకటైన నాయకులు
- ప్రశంసలు కురిపిస్తున్న ప్రజలు
- ఆశ్చర్యానికి గురైన రెండు పార్టీల కార్యకర్తలు





**దుబ్బాక ప్రతినిధి, ఆగస్టు 31,:**
ఇప్పటి వరకు దుబ్బాక నియోజకవర్గంలో ఏ అభివృద్ధి కార్యక్రమం జరిగినా బీఆర్ఎస్, బీజేపీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉండేది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఒకే కార్యక్రమానికి వచ్చారంటే చాలు కార్యకర్తల నినాదాలు, ఉద్రిక్తత, భారీ పోలీసు బందోబస్తు సాధారణంగా కనిపించేవి. వాటన్నింటికీ భిన్నంగా సోమవారం జరిగిన పరిణామం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. అక్బర్ పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి, భూంపల్లి గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు ఒకే వాహనంలో వచ్చి కలిసి వచ్చారు. ఒకరికొకరు ఆప్యాయంగా మాట్లాడుకోవడం, ఒకరికొకరు కొబ్బరికాయలు అందించుకోవడం, అభివృద్ధి పనులను సంయుక్తంగా ప్రారంభించడం, అదే వాహనంలో కలిసి ప్రయాణించడం చూసి కార్యకర్తలే ఆశ్చర్యపోయారు. ఎమ్మెల్యే, ఎంపీతో పాటు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కూడా ఒకే వేదికపై ఉన్నారు. ఎలాంటి పోలీసు బందోబస్తు లేకుండా, ఎలాంటి గొడవలు లేకుండా కార్యక్రమాలు ప్రశాంతంగా సజావుగా జరిగాయి. పార్టీలు వేరైనా, జెండాలు, ఎజెండాలు వేరైనా అభివృద్ధి విషయంలో ఒకటిగా ఉండాలనే వారి నిర్ణయంపై నియోజకవర్గ ప్రజల నుండి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# కుత్బుల్లాపూర్‌లో ఘనంగా మెడ్చల్–మల్కాజిగిరి అర్బన్ బీజేపీ కార్యాలయం ప్రారంభం

- పార్టీ బలోపేతానికి సమష్టి కృషి చేయాలి: నాయకుల పిలుపు
- భారీగా తరలివచ్చిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 31,:** కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మెడ్చల్–మల్కాజిగిరి అర్బన్ భారతీయ జనతా పార్టీ నూతన కార్యాలయం ఘనంగా ప్రారంభమైంది. గిరివర్ధన్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం పార్టీ శ్రేణుల సందడితో అంగరంగ వైభవంగా సాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నరపరాజు రామచందర్ రావు, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, డాక్టర్ ఎస్. మల్లారెడ్డి హాజరై నూతన కార్యాలయాన్ని ప్రారంభించి పార్టీ నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి నూతన కార్యాలయం కీలక వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, డివిజన్ అధ్యక్షులు, బీజేపీ కుటుంబ సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దీంతో కార్యాలయ ప్రారంభోత్సవ ప్రాంగణం పార్టీ జెండాలు, నినాదాలతో సందడిగా మారింది.

### గిరివర్ధన్ రెడ్డికి శుభాకాంక్షలు

ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో-కన్వీనర్, గాజులరామారం డివిజన్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి ఆధ్వర్యంలో ఆయన తనయుడు, బీజేవైఎం నాయకుడు రావుల పృధ్వి కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతన బాధ్యతలు స్వీకరించిన మెడ్చల్–మల్కాజిగిరి అర్బన్ బీజేపీ అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డిని కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. బీజేపీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, పార్టీ సిద్ధాంతాలను ప్రతి కార్యకర్త ప్రజలకు చేరువ చేయాలని పిలుపునిచ్చారు. నూతన కార్యాలయం ద్వారా పార్టీ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ, నాయకులు–కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత చురుకైన పాత్ర పోషించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రావుల రిషింద్ర సాగర్, గడ్డమీది భరత్ కుమార్, గుజ్జ సందీప్, మంజునాథ్, రామారావు, శివ తదితర సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగష్టు 31,:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. సోమవారం షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను ఆయన కలుసుకుని వారి సమస్యలు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా పలు కాలనీలకు చెందిన ప్రజలు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు వివరించిన పలు సమస్యలపై సంబంధిత అధికారులతో కూన శ్రీశైలం గౌడ్ ఫోన్‌లో మాట్లాడి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. మరికొన్ని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా, రోడ్డమేస్త్రి నగర్ డివిజన్‌కు చెందిన పలువురు మహిళలు రాఖీ పౌర్ణమి సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్‌ను కలిసి రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మహిళలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. తనపై ప్రజలు చూపుతున్న ప్రేమ, అభిమానం ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మతసామరస్యమే మన బలం



- హిందూ–ముస్లింలు సోదరభావంతో మెలుగుతూ ఐక్యతను చాటాలి: బీఆర్ఎస్ నేత ఎస్. కమలాకర్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 31, ఉదయం:**
హిందూ–ముస్లింలు సోదరభావంతో మెలుగుతూ మతసామరస్యానికి ప్రతీకగా నిలవాలని న్యాయవాది, బీఆర్ఎస్ నేత ఎస్. కమలాకర్ పిలుపునిచ్చారు. పరస్పర ప్రేమ, సౌభ్రాతృత్వంతోనే సమాజంలో శాంతి, ఐక్యత సాధ్యమవుతాయని ఆయన పేర్కొన్నారు. జష్నే ఈద్ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా సోమవారం హెచ్ఎంటీ మెయిన్ రోడ్డులోని హజ్రత్ ఫైజుద్దీన్ షా ఖాద్రి రహమతుల్లా దర్గాను ఎస్. కమలాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా మత పెద్దలు, పలువురు నాయకులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులు, ప్రజల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం అనంతరం దర్గా కమిటీ సభ్యులు నాయకులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మతసామరస్యం, సోదరభావం, సామాజిక ఐక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కూరపాటి కరుణాకర్ రాజు, పొడిచేటి రాములు గౌడ్, జునేద్, దర్గా కమిటీ సభ్యులు షేక్ మజ్హర్, మహమ్మద్ ఖలీల్, సయ్యద్ ఖాజా, ఎం.డి. నజీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి

**సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 31,:**
ప్రజావాణిలో అర్జీదారులు ఇచ్చిన దరఖాస్తులను పెండింగ్లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ఆయా శాఖల వారిగా ఆన్లైన్లో ప్రజావాణి దరఖాస్తుల పెండింగ్ వివరాలను గురించి సమీక్ష నిర్వహిస్తూ ప్రజలు ఎంతో నమ్మకంతో తమ సమస్యలను అధికారులకు తెలిపి పరిష్కరించుకోవడానికి ప్రజావాణికి వస్తారని ఆ నమ్మకాన్ని ప్రజలకు కల్పించేలా పనిచేయాలని ఆదేశించారు. ఆయా శాఖల్లో ప్రజావాణిలో వచ్చిన పెండింగ్ దరఖాస్తులను వెంటనే డిస్పోసల్ చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో పరిష్కారం కోసం వచ్చేసిన ప్రజల నుండి మొత్తం 103 దరఖాస్తులు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగ రాజమ్మ, ఎస్డిసి సుదర్శన్ రెడ్డి జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న ఆడువాల జ్యోతి లక్ష్మణ్



**జగిత్యాల ప్రతినిధి, ఆగష్టు 31, :**
జగిత్యాల నియోజకవర్గంలో సోమవారం పలు శుభకార్యాలు పాల్గొన్న జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్. వారి వెంట కౌన్సిలర్ సిరికొండ పద్మ సింగారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, మాజీ కౌన్సిలర్ వీరబత్తిని శ్రీనివాస్, కొక్కుల రమేష్, మాజీ ఎంపీపీ శేఖర్ రెడ్డి, మోత సర్పంచ్ మహేష్, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పలువురు నాయకులను పరామర్శించిన ఆడువాల జ్యోతి లక్ష్మణ్



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ఆగష్టు 31, :**
రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవి తల్లి లక్ష్మీ అనారోగ్యంతో, ధర్మపురి మున్సిపల్ చైర్పర్సన్ వేముల నాగలక్ష్మి తల్లి గంగమ్మ అనారోగ్యంతో మరణించగా సోమవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్. మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, మాజీ కౌన్సిలర్ వీరబత్తిని శ్రీనివాస్, కొక్కుల రమేష్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 15వ ఆర్థిక సంఘం నిధులతో మెదక్ మున్సిపాలిటీకి రూ.2.31 కోట్ల నిధులు మంజూరు

**ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు కృషికి ప్రజల ప్రశంసలు**



**మెదక్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 31,:**
15వ ఆర్థిక సంఘం కింద మెదక్ మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.2,31,10,682 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులను సాధించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు నిరంతరం కృషి చేస్తున్నారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మెదక్‌ను అభివృద్ధి చెందిన, ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఆయన ముందుకు సాగుతున్నారు. ఒకవైపు విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూనే, మరోవైపు మెదక్‌లో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం ఎమ్మెల్యే పలు చర్యలు చేపడుతున్నారు. 15వ ఆర్థిక సంఘం కింద మున్సిపాలిటీకి నిధులు మంజూరు కావడం ద్వారా మెదక్ పట్టణంలో మరిన్ని అభివృద్ధి పనులకు అవకాశం ఏర్పడింది. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే దిశగా ఈ నిధులు ఉపయోగపడనున్నాయి. మెదక్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు చేస్తున్న నిరంతర ప్రయత్నాలను నియోజకవర్గ అన్ని వర్గాల ప్రజలు పార్టీలకు అతీతంగా ప్రశంసిస్తున్నారు.

# ప్రజాపాలనలో 1000 రోజులు తెలంగాణ ప్రగతికి కొత్త దిశ

**మంత్రి వాకిటి శ్రీహరి**

**తెలంగాణ అభివృద్ధి నమూనా దేశానికి దిక్సూచిగా నిలుస్తుంది**



**హైదరాబాద్ బ్యూరో, ఆగష్టు 31, :**
కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు, తెలంగాణ ప్రజలకు మంత్రి వాకిటి శ్రీహరి శుభాకాంక్షలు తెలిపారు. ఈ 1000 రోజుల్లో రైతు సంక్షేమం, పేదల భరోసా, యువతకు ఉద్యోగాలు, విద్య, సామాజిక న్యాయానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ, రైతు భరోసా పెంపు, గృహజ్యోతి, రూ.500కే గ్యాస్ సిలిండర్, 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి నిర్ణయాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయన్నారు. బీసీ కులగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ ద్వారా సామాజిక న్యాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. 1000 రోజులు ఒక మైలురాయి మాత్రమేనని, ప్రజల సంక్షేమం, తెలంగాణ అభివృద్ధి కోసం రాబోయే రోజుల్లో మరింత వేగంగా పనిచేస్తామని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

# ఇండ్ల మధ్య బెల్ట్ షాపులు ఏందయ్యా

- **దమ్మపేట గ్రీవెన్స్ డే లో వార్డు సభ్యుల వినతి**
- **ఆదర్శంగా నిలిచిన బెల్ట్ షాప్ రహిత గ్రామం నల్లకుంట**




**దమ్మపేట,ఆగష్టు 31,:** దమ్మపేట గ్రామ పంచాయతీ పరిధిలో బెల్ట్ షాపులు అనధికార మద్యపాన దుకాణాలను ఇండ్ల మధ్య, బడులు, గుడులు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని దమ్మపేట గ్రామ పంచాయతీకి చెందిన వార్డు సభ్యులు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రీవెన్స్ డే లో ఎక్సైజ్ శాఖ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడుతూ ఇండ్ల మధ్య బెల్ట్ షాపులు వలన మహిళలు, బాలికలు, యువత పై తీవ్రమైన దుష్ప్రభావాలు కలుగుతున్నాయి అన్నారు. కుటుంబ కలహాలు, నిత్యం మద్యం అందుబాటులో ఉండడం వల్ల పురుషులు సంపాదనంతా మద్యానికే వినియోగిస్తున్నారు. దీంతో కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు, గొడవలు పెరుగుతున్నాయి అన్నారు. మద్యం సేవించే వారు ఇష్టమొచ్చినట్టు తిరుగుతుండటం వలన మహిళలకు, బాలికలకు భద్రత లేకుండా పోయింది అని, మద్యం మత్తులో భార్యా పిల్లలను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు అన్నారు. పాఠశాలల వద్ద ఉండడంతో చిన్న వయసులోనే పిల్లలు నిత్యం మద్యం అమ్మకాలను, తాగుబోతుల ప్రవర్తనను చూడడం వల్ల వారి మానసిక ఎదుగుదల పై ప్రభావం పడి త్వరగా వ్యసనాలకు బానిసలయ్యే ప్రమాదం ఉంది అన్నారు. గొడవలు చేయడం, అసభ్య పదజాలం వాడడం వల్ల విద్యార్థులు, ముఖ్యంగా బాలికలు భయపడుతూ చదువుకోవాల్సి వస్తుంది అన్నారు. ప్రార్థన మందిరాల వద్ద ఉండడం వలన పవిత్రత దెబ్బతినడం, ఆధ్యాత్మిక వాతావరణం ఉండాల్సిన గుడుల వద్ద భక్తులకు అసౌకర్యం ఉంది అన్నారు. తాగి గుడిలో పడుకుంటున్నారు అని, గుడికి వచ్చే మహిళలు, వృద్ధులు, పిల్లలు తాగుబోతుల వేధింపులకు గురవుతున్నారు. ప్రశాంతంగా దైవదర్శనం చేసుకునే పరిస్థితి లేకపోయింది. మద్యం మత్తులో చిన్న చిన్న విషయాలకే గొడవలు పడి, దొంగతనాలు, శారీరక దాడులు వంటి నేరాలు పెరుగుతున్నాయి. బెల్ట్ షాపుల్లో తరచూ నకిలీ లేదా నాణ్యత లేని మద్యం అమ్మడం వల్ల మద్యం తాగే వారి ఆరోగ్యం తీవ్రంగా పాడవుతుంది అన్నారు. ఇండ్ల వద్ద మూత్ర విసర్జన, ఉమ్మి వేయడం, రోడ్డు మీద బాటిల్స్ పడవేస్తున్నారు పిర్యాదులు ఎక్కువుగా ప్రజల నుండి వస్తున్నాయి అన్నారు, 24 గంటలు మద్యం దొరకడంతో అర్ధరాత్రి అని తేడా లేకుండా బెల్ట్ షాపు నిర్వహించే వారి ఇండ్ల వద్ద గేటులు కొడుతుండటంతో నిద్ర పోతున్న ప్రక్క ఇండ్ల వారు ఇబ్బంది పడుతున్నారు అన్నారు. బెల్ట్ షాపులను నిషేధించామని ప్రభుత్వం ఎంత చెబుతున్నా ఎక్కడ చూసిన బెల్ట్ షాపులు అక్కడ ఇక్కడ తేడా లేకుండా దర్శనమిస్తూనే ఉన్నాయి అన్నారు. మద్యం షాపుల పని వేళలు ముగిసిన తర్వాత త్రాగేవారు బెల్ట్ దుకాణాలకు వెళ్ళి తాగుతున్నారు అని తదితర సమస్యలను, దుష్ప్రభావాలను అధికారులకు వివరంగా చెప్పి వెంటనే అనధికార మద్యం దుకాణాలను నివాసిత ప్రాంతాలకు దూరంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. దమ్మపేట గ్రామ పంచాయతీ పరిధిలో గల నల్లకుంట గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహించకుండా ప్రజలు తీసుకున్న నిర్ణయం ప్రశంసించదగ్గ విషయం అన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, బత్తుల సాయి ఉన్నారు.

# అక్బర్‌పేట-భూంపల్లిలో అభివృద్ధి పనులకు శ్రీకారం





**అక్బర్ పేట-భూంపల్లి, ఆగస్టు 31,:** సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ముఖ్య అతిథులుగా హాజరై పలు పనులను ప్రారంభించి, నూతన పనులకు భూమిపూజ చేశారు. భూంపల్లి గ్రామంలో మహిళా సమాఖ్య ఆవరణలో మహిళల కోసం ప్రత్యేకంగా నిర్మించిన మహిళా భవనాన్ని ఎమ్మెల్యే, ఎంపీ, కమిషన్ చైర్మన్ కలిసి ప్రారంభించారు. మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, స్వయం సహాయక కార్యకలాపాలకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. అనంతరం భూంపల్లి ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా నిర్మించిన కాంపౌండ్ వాల్ ను ప్రారంభించారు. విద్యార్థులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం భూంపల్లి పాఠశాలలో మండల స్థాయి ఎస్జిఎఫ్ క్రీడలను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచాలని సూచించారు.

**మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం**

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా నూతనంగా మంజూరైన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించడమే లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి, మహిళా సాధికారతకు, విద్యా వసతుల మెరుగుదలకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ నాయకులు, బీజేపీ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గాజులరామారం సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగష్టు 31,:**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 278 గాజులరామారం డివిజన్‌లో పలు ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలని కోరుతూ సోమవారం సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఉమ్మడి గాజులరామారం డివిజన్ అధ్యక్షుడు సాయినాథ్ నేత ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ గాజులరామారం సర్కిల్ డీసీ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. చిత్తరమ్మ ఆలయం సమీపంలోని యూటర్న్ వద్ద స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయడంతో పాటు, చిత్తరమ్మ ఆలయం ఎదురుగా ఉన్న వీధిలో కాకతీయ టెక్నో స్కూల్ సమీపంలోని రోడ్డు అధ్వాన పరిస్థితిని వివరించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అదేవిధంగా బాలానగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. శ్రీ వేణి ఎంక్లేవ్ నుంచి చిత్తరమ్మ ఆలయం వద్ద ఉన్న యూటర్న్ వైపు వందలాది వాహనాలు రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తుండటంతో తరచూ ఇబ్బందులు, ప్రమాద పరిస్థితులు ఏర్పడుతున్నాయని వివరించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అనంతరం కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సర్వే నంబర్ 12లో సుమారు 4 ఎకరాల విలువైన భూమి అన్యాక్రాంతమైన అంశంపై మరోసారి వినతిపత్రం సమర్పించారు. ఈ విషయంపై గతంలో 16-07-2025, 23-08-2025 తేదీల్లో వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని వారు తెలిపారు. సర్వే నంబర్ 12పై రెండు రోజుల్లోగా ఏసీ సర్వే నిర్వహించి సమస్యను పరిష్కరించకపోతే



గాజులరామారం సర్కిల్‌లో పెద్ద ఎత్తున నిరాహార దీక్ష చేపడతామని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకురాలు రేవతి రాఘవుల, ఉమ్మడి డివిజన్ కార్యదర్శి శ్రీనివాస్ నేత, సీనియర్ నాయకులు శారద, సామంతుల శ్రీనివాస్ పటేల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిల విడుదలకు బీజేవైఎం నిరసన దీక్ష

- **రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్**



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 31 ::** తెలంగాణ రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో సోమవారం నిరసన దీక్ష నిర్వహించారు. మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఐడీపీఎల్ చౌరస్తా వద్ద చేపట్టిన ఈ ఒకరోజు నిరసన దీక్షకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరై సంఘీభావం తెలిపారు. తమకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గిరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది విద్యార్థులకు రూ.15 వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉండటం దురదృష్టకరమన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడకుండా పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన దీక్షలో గిరివర్ధన్ రెడ్డితో పాటు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు జేకే శేఖర్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు గరిగె శేఖర్, వేణు, మహిళా నాయకురాళ్లు విజయలక్ష్మి , మాధురి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లి మాధవి, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. మల్లారెడ్డి, జిల్లా సర్ ఇన్‌చార్జ్ నందనం దివాకర్, పార్లమెంట్ మాజీ కన్వీనర్ ఆర్.కే. శ్రీనివాస్, ఉప్పల్ సర్ కన్వీనర్ గోపాల్ గౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షులు మల్లేష్ యాదవ్, గిరిజన మోర్చా అధ్యక్షులు వెంకటేష్ నాయక్, నాయకులు రాజా సదానందం, క్రిష్ణారెడ్డి, కట్టా కుమార్‌తో పాటు జిల్లాలోని వివిధ డివిజన్ల అధ్యక్షులు తదితరులు హాజరై దీక్షకు మద్దతు తెలిపారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షులు శ్రీనాథ్, నాయకులు శ్యామ్, పృథ్వి, ఆదిత్య డిమాండ్ చేశారు. ఫీజు బకాయిల విడుదల కోసం బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.కావాలంటే దీన్ని ఇంకా పత్రికా హెడ్డింగ్‌లతో ఆకర్షణీయంగా, లేదా చిన్న వార్తగా 250–300 పదాల్లో కూడా మార్చవచ్చు.



# అణు భౌతిక శాస్త్ర పితామహుడు రూథర్‌ఫోర్డ్

## నేడు ఎర్నెస్ట్ రూథర్‌ఫోర్డ్ జయంతి

ఎర్నెస్ట్ రూథర్‌ఫోర్డ్ (ఆగస్టు 30 1871 - అక్టోబరు 19 1937) న్యూజీలాండ్ కు చెందిన ఒక రసాయనిజ్ఞుడు, ఇతనికి అణు భౌతిక శాస్త్ర పితామహుడు అనే బిరుదు గలదు. రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి (1908) పొందాడు. అణువులలో శక్తితో కూడిన కేంద్రకం వుంటుందని కనిపెట్టాడు. పరమాణువులో ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్ అనే మూడు ముఖ్యమైన మూలకణాలున్నాయి. ఈ కణాలు పరమాణువులో ఏ విధంగా అమరి ఉన్నాయో తెలియజెప్పేదే పరమాణు నిర్మాణం. దీనికి సంబంధించి శాస్త్రవేత్తలు ఎన్నో నమూనాలను ప్రవేశపెట్టారు. అందులో రూథర్ ఫర్డ్ నమూనా ఒకటి. తను చేసిన - కణ పరిక్షేపణ ప్రయోగ పరిశీలనల ఆధారంగా ఈ నమూనాని ప్రతిపాదించాడు. అణువు యొక్క రూథర్‌ఫోర్డ్ నమూనా (లేదాగ్రహ మండల నమూనా, ఇదే సిద్దాంతం ఆ తరువాత బోర్ నమూనా లేదా కక్ష్యా నమూనాగా ఏర్పడడానికి దోహదపడింది) ను ప్రతిపాదించాడు. ఇతడు రూథర్‌ఫోర్డ్ -కణ పరిక్షేపణ ప్రయోగాన్ని బంగారు రేకు గుండా -కణ పరిక్షేపణ ప్రయోగంచేసి కెంద్రకం యొక్క ఉనికిని కనిపెట్టాడు. ఇతడికి 1908లో రసాయనిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. న్యూజిలాండ్ లోని నెల్సన్ లో 1871 ఆగస్టు 30న జన్మించిన రూథర్‌ఫర్డ్ కు చిన్నతనంలోనే సైన్స్ పట్ల అభిరుచి కలిగింది. పదేళ్లకే ఎలిమెంటరీ ఫిజిక్స్ పుస్తకాన్ని క్షుణ్ణంగా చదివేశాడు. న్యూజిలాండ్ విశ్వ విద్యాలయంలో స్కాలర్‌షిప్‌తో చేరిన అతడు బీఏ, ఎమ్ఏ, బీఎస్సీ డిగ్రీలు సాధించాడు. ఇంగ్లండ్ లోని కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తూనే అత్యంత వేగంగా ప్రయాణించే విద్యుదయస్కాంత తరంగాలను కనిపెట్టి ప్రపంచ రికార్డు సాధించాడు. ఇరవై ఏడేళ్ల వయ-సులోనే కెనడాలోని మెగిల్ విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా చేరి పరిశోధనల్లో నిమగ్న మయ్యాడు. అక్కడే యురేనియం, థోరియంలాంటి రేడియోధార్మిక పదార్థాలు వెలువరించే ఆల్ఫా, బీటా వికిరణాలను ఆవిష్కరించాడు. రేడియో ధార్మిక విఘటనం (ఘుఎఅశీ ఖవ్‌ఙఅజవ ఎవఘ్షుఎ) నియమాలను ప్రతిపాదించాడు. ఒక రేడియో ధార్మిక పదార్థంలో ఉండే సగం పరమాణువులు విఘటనం చెందడానికి పట్టే 'అర్థ జీవిత కాలం' ను నిర్వచించాడు. ఈ సూత్రం ప్రకారం రేడియో డేటింగ్ పద్ధతి ద్వారక్వ భూమి వయస్సును కూడా కనుగొనవచ్చని చెప్పాడు. అలాగే కృత్రిమ మూలకాల పరివర్తన ద్వారా నైట్రోజన్‌ను, ఆక్సిజన్‌గా మార్చవచ్చని తెలిపాడు. ఈ పరిశోధనలకు 1908లో నోబెల్ బహుమతి అందుకున్నాడు.

కెనడా నుంచి ఇంగ్లండ్ తిరిగి వచ్చిన తర్వాత పలుచటి బంగారు రేకుపై ధనావేశమున్న ఆల్ఫాకిరణాలను ప్రసరింప చేసినప్పుడు 20000 కణాలలో ఒకటి వెనక్కి తిరిగి రావడాన్ని గమనించాడు. అందుకు కారణం పరమాణువులో ధనావేశమున్న కేంద్రకం ఉండటం కారణంగా కేంద్రకంలో ఉండే ప్రోటాన్లు వాటిని వికర్షించడమేనని కనుగొన్నాడు. సూర్యుడి చుట్టూ గ్రహాలు తిరుగుతున్నట్టే, పరమాణువుల్లోని కేంద్రకం చుట్టూ ఎలక్ట్రాన్లు తిరుగుతూ ఉంటాయని ప్రతిపాదించాడు. ఇదే రూథర్‌ఫర్డ్ పరమాణు నమూనాగా పేరొందింది. దీనినే గ్రహమండల నమూనా అంటారు. ఆ తర్వాత కేంద్రకంలో ప్రోటాన్లతో పాటు న్యూట్రాన్లు ఉంటాయని ఊహించాడు. రసాయన చర్యలతో ఒక మూలకాన్ని వేరొక మూలకంగా మార్చలేం. కానీ కేంద్రక చర్యలతో ఒక మూలకాన్ని మరొక మూలకంగా మార్చవచ్చు. స్థిరమైన మూలక కేంద్రకాలను - కణం లేదా ప్రోటాన్‌తో తాడించడం వల్ల వాటిని వేరొక మూలకాలుగా మార్చొచ్చు. ఈ ప్రక్రియను కృత్రిమ పరివర్తనం అంటారు. రూథర్‌ఫర్డ్ మొదటిసారిగా నత్రజనిని ఆక్సిజన్‌గా మార్చాడు. ఆ విధంగా ఏర్పడిన మూలకాలు కొన్ని రేడియో ధార్మికతను ప్రదర్శిస్తాయి. వాటిని రేడియో ఐసోటోపులు అంటారు. వాటిని మనం వైద్యరంగంలో, వ్యవసాయ రంగంలో, పరిశ్రమల్లో ఉపయోగిస్తున్నాం .ఆయన శిష్యుల్లో చాలా మంది నోబెల్ బహుమతులు సాధించడం విశేషం. అనేక అవార్డులు సాధించిన ఆయన గౌరవార్థం 104 అణుసంఖ్య ఉన్న మూలకానికి రూథర్ ఫోర్డియం అని పేరు పెట్టారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# అదృశ్యమైన మనుషులు.. మిగిలేది అంతులేని వేదన!

### నేడు అంతర్జాతీయ తప్పిపోయిన వారి దినోత్సవం

### బలవంతపు అదృశ్యాలు మానవ హక్కులపై చెరగని మచ్చలు

### ఆచూకీ కోసం ఏళ్ల తరబడి కుటుంబాల నిరీక్షణ

### సత్యం చెప్పడం.. న్యాయం చేయడం ప్రభుత్వాల బాధ్యత

### మనిషి స్వేచ్ఛ, గౌరవం కంటే ఏ అధికారమూ గొప్పది కాదు




ప్రపంచంలో ఒక మనిషి మరణించాడని తెలిస్తే కుటుంబం కన్నీళ్లతోనైనా ఆ నిజాన్ని అంగీకరించే ప్రయత్నం చేస్తుంది. కానీ తమ వ్యక్తి బతికే ఉన్నాడో.. మరణించాడో.. ఎక్కడున్నాడో కూడా తెలియకుండా ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వస్తే..? ఆ బాధకు అంతముండదు. ఆ నిరీక్షణకు సమాధానం ఉండదు. అలాంటి వేలాది కుటుంబాల వేదనను ప్రపంచానికి గుర్తుచేసే రోజే ఆగస్టు 30 - అంతర్జాతీయ తప్పిపోయిన వారి దినోత్సవం.

### నియంతృత్వాల నీడలో మొదలైన పోరాటం

ఈ దినోత్సవం వెనుక మానవ హక్కుల చరిత్రలోనే అత్యంత విషాదకరమైన అధ్యాయం ఉంది. లాటిన్ అమెరికాలో సైనిక నియంతృత్వ పాలనల కాలంలో ప్రభుత్వాలను ప్రశ్నించిన రాజకీయ కార్యకర్తలు, సామాజిక ఉద్యమకారులు, విద్యార్థులు, సామాన్యులు పెద్ద సంఖ్యలో అదృశ్యమయ్యారు. తమవారు ఎక్కడున్నారో చెప్పాలంటూ బాధిత కుటుంబాలు చేసిన పోరాటమే క్రమంగా అంతర్జాతీయ ఉద్యమంగా మారింది. బలవంతంగా అదృశ్యమైన వారి కుటుంబాలకు చెందిన సంఘాలు ఈ సమస్యను ప్రపంచం ముందుకు తీసుకొచ్చాయి. అనంతర కాలంలో ఐక్యరాజ్యసమితి కూడా బలవంతపు అదృశ్యాల సమస్యపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇలాంటి ఘటనల పరిశీలనకు ప్రత్యేక కార్యబృందాన్ని ఏర్పాటు చేయడంతో పాటు బలవంతపు అదృశ్యాల నుంచి వ్యక్తులను రక్షించేందుకు అంతర్జాతీయ స్థాయిలో చట్టపరమైన వ్యవస్థలను బలోపేతం చేసే ప్రయత్నాలు జరిగాయి.

### అదృశ్యం అంటే.. ఒక మనిషినే కాదు

బలవంతపు అదృశ్యం అంటే ఒక వ్యక్తిని ప్రభుత్వ యంత్రాంగం, భద్రతా బలగాలు లేదా వాటి మద్దతుతో పనిచేసే వ్యక్తులు అదుపులోకి తీసుకుని.. ఆ తర్వాత అతడి ఆచూకీ లేదా పరిస్థితి గురించి సమాచారం ఇవ్వకుండా దాచిపెట్టడం. ఇది కేవలం ఒక వ్యక్తి స్వేచ్ఛను హరించడం మాత్రమే కాదు. ఒక కుటుంబాన్ని జీవితాంతం అనిశ్చితిలోకి నెట్టే తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన. "బతికే ఉన్నారా..? మరణించారా..? ఎక్కడున్నారు..?" అనే ప్రశ్నలకు సమాధానం దొరకక కుటుంబ సభ్యులు అనుభవించే మానసిక వేదన వర్ణనాతీతం. ఆచూకీ కోసం కార్యాలయాల చుట్టూ తిరగడం, న్యాయస్థానాలను ఆశ్రయించడం, ఏ చిన్న సమాచారం వచ్చినా తమవారే కావచ్చనే ఆశతో పరుగులు తీయడం.. ఇలా వారి జీవితమే నిరీక్షణగా మారిపోతుంది.

### ప్రపంచాన్ని వెంటాడుతున్న విషాదం

లాటిన్ అమెరికాలోని అర్జెంటీనా, చిలీ, గ్వాటెమాలా, ఎల్ సాల్వడార్ వంటి దేశాల్లో గత సైనిక పాలనల కాలంలో జరిగిన బలవంతపు అదృశ్యాలపై ఇప్పటికీ బాధిత కుటుంబాలు సత్యం, న్యాయం కోసం పోరాడుతున్నాయి. ఆసియాలో శ్రీలంక అంతర్యుద్ధం, నేపాల్‌లో సాయుధ సంఘర్షణల కాలంలోనూ అనేక అదృశ్యం కేసులు నమోదయ్యాయి. పాకిస్తాన్, బంగ్లాదేశ్ తదితర దేశాల్లోనూ ఇలాంటి ఆరోపణలు మానవ హక్కుల చర్చల్లో తరచూ ప్రస్తావనకు వస్తున్నాయి. సిరియా, ఇరాక్, లెబనాన్ తదితర సంఘర్షణ ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధాలు, అంతర్గత ఘర్షణలు, ఉగ్రవాదం కారణంగా ఆచూకి తెలియకుండా పోయిన వారి సమస్య మరింత సంక్లిష్టంగా మారింది. యుద్ధం ముగిసినా.. పాలకులు మారినా.. తమవారి కోసం ఎదురుచూసే కుటుంబాల నిరీక్షణ మాత్రం ముగియడం లేదు.

### భారత్‌లోనూ వినిపించిన ప్రశ్నలు

భారత్‌లోనూ సంఘర్షణ ప్రభావిత ప్రాంతాల్లో అదృశ్యాల ఆరోపణలు గతంలో చర్చకు వచ్చాయి. ముఖ్యంగా కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో ఉగ్రవాదం, తిరుగుబాట్లు, భద్రతా చర్యల నేపథ్యంలో పలువురు అదృశ్యమైనట్లు బాధిత కుటుంబాలు, మానవ హక్కుల సంస్థలు ఆరోపించిన సందర్భాలున్నాయి. ఆయా కేసుల్లో నిజానిజాలను వెలికితీసి బాధిత కుటుంబాలకు సమాధానం చెప్పాలని పౌర సమాజ సంస్థలు కోరుతూ వచ్చాయి.

### కుటుంబాలకు కావాల్సింది ఒక్కటే.. నిజం

బలవంతపు అదృశ్యాల విషయంలో బాధిత కుటుంబాలు కోరుకునేది మొదట సత్యమే. తమవారు ఏమయ్యారు..? ఎక్కడున్నారు..? వారికి ఏం జరిగింది..? అనే ప్రశ్నలకు సమాధానం తెలుసుకునే హక్కు వారికి ఉంది. జరిగిన అన్యాయంపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధ్యులను చట్టం ముందు నిలబెట్టడం, బాధిత కుటుంబాలకు తగిన పరిహారం, పునరావాసం కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. అంతటితో సరిపోదు. మరో కుటుంబానికి ఇలాంటి వేదన ఎదురుకాకుండా చట్టపరమైన రక్షణ వ్యవస్థలను పటిష్ఠం చేయాలి. అరెస్టులు, నిర్బంధాల విషయంలో పారదర్శకత ఉండాలి. అధికార దుర్వినియోగానికి అవకాశం లేకుండా జవాబుదారీతనాన్ని పెంచాలి. మానవ హక్కుల పరిరక్షణను ప్రభుత్వ వ్యవస్థలో విడదీయలేని భాగంగా మార్చాలి.

### జ్ఞాపక దినం కాదు.. న్యాయం కోసం పిలుపు

అంతర్జాతీయ తప్పిపోయిన వారి దినోత్సవం క్యాలెండర్‌లో మరో జ్ఞాపక దినం మాత్రమే కాదు. సమాధానం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాల గొంతుకకు ప్రపంచం చెవివిప్పాల్సిన రోజు. అధికారానికి హద్దులు ఉన్నాయని.. ప్రతి మనిషికీ జీవించే హక్కు, స్వేచ్ఛ, గౌరవం ఉన్నాయని గుర్తుచేసే రోజు. ఒక మనిషిని బలవంతంగా అదృశ్యం చేయడం అంటే అతడి ఉనికిని మాత్రమే చెరిపేయడం కాదు.. ఒక కుటుంబం ఆశలను, వారి ప్రశాంతతను, సమాజం న్యాయంపై పెట్టుకున్న నమ్మకాన్ని కూడా దెబ్బతీయడమే. యుద్ధమైనా.. రాజకీయ సంఘర్షణైనా.. ఉగ్రవాదమైనా.. అధికార ప్రదర్శనైనా.. మనిషి ప్రాణం, స్వేచ్ఛ, గౌరవం కంటే గొప్పవి కావు. అదృశ్యమైన ప్రతి మనిషి వెనుక సమాధానం కోసం ఎదురుచూస్తున్న ఒక కుటుంబం ఉందన్న సత్యాన్ని ప్రపంచం మరవకూడదు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# వెండితెర సత్యభామ.. జమున

### ఆగస్టు 30.. జమున జన్మదినం

జనాభాయి అంటే ఎవరో చాలామందికి తెలియకపోవచ్చు. జూలూరి జమున అన్నా వెంటనే గుర్తుపట్టకపోవచ్చు. కానీ 'జమున' అనగానే తెలుగు సినీ ప్రేక్షకుల మదిలో ఓ అపురూప రూపం మెదులుతుంది. గడుసుదనం.. గాంభీర్యం.. అందం.. అభినయం.. ఆత్మవిశ్వాసం కలగలిసిన కథానాయిక గుర్తుకొస్తుంది. మరీ ముఖ్యంగా సత్యభామ అంటే జమున.. జమున అంటే సత్యభామ అన్నంతగా ఆ పాత్రపై తనదైన ముద్ర వేసిన అలనాటి మేటి నటి ఆమె. జమున 1936 ఆగస్టు 30న హంపీలో జన్మించారు. తల్లి కౌసల్యాదేవి, తండ్రి వ్యాపారవేత్త నిప్పని శ్రీనివాసరావు. ఆమె బాల్యం గుంటూరు జిల్లా దుగ్గిరాలలో గడిచింది. తల్లిదండ్రులు తొలుత పెట్టిన పేరు జనాభాయి. జన్మ నక్షత్రం ప్రకారం నది పేరు ఉండాలన్న సూచనతో మధ్యలో 'ము' అక్షరాన్ని చేర్చి జమునగా మార్చారు. సినిమా రంగంలోకి వచ్చిన తర్వాత పెట్టుకున్న పేరు కాదది. చిన్నతనం నుంచే జమునకు కళలపై ఆసక్తి ఎక్కువ. శాస్త్రీయ సంగీతం, హార్మోనియంలో శిక్షణ పొందారు. పాఠశాల రోజుల నుంచే నాటకాల్లో నటించేవారు. సినీనటుడు జగ్గయ్యది కూడా దుగ్గిరాల కావడంతో ఆయన కుటుంబంతో జమున కుటుంబానికి పరిచయం ఉండేది. తెనాలి సమీపంలోని మండూరు గ్రామంలో ప్రదర్శించిన 'ఖిల్జీ రాజ్య పతనం' నాటిక కోసం జగ్గయ్య ఆమెను ఎంపిక చేశారు. అందులో గుమ్మడి వెంకటేశ్వరరావు కూడా నటించారు. రంగస్థలంపై జమున చూపిన ప్రతిభే ఆమెకు సినిమా అవకాశాల ద్వారాలు తెరిచింది. బి.వి.రామానందం దర్శకత్వంలో వచ్చిన 'పుట్టిల్లు'తో 1953లో జమున వెండితెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, జగ్గయ్య వంటి అగ్ర కథానాయకుల సరసన నటించి తెలుగు చిత్రసీమలో అగ్ర కథానాయికగా ఎదిగారు. జమున సినీ జీవితంలో ఎన్నో పాత్రలు పోషించినా 'సత్యభామ' ఆమెకు ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. 'వినాయక చవితి'లో తొలిసారి సత్యభామగా కనిపించిన ఆమె, ఆ తర్వాత 'శ్రీకృష్ణ తులాభారం'లో ఆ పాత్రకు మరింత వన్నె తెచ్చారు. కమలాకర కామేశ్వరరావు దర్శకత్వంలో రూపొందిన ఆ చిత్రంలో జమున చూపిన అభినయం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. సత్యభామలోని ఆత్మాభిమానం, అలక, ప్రేమ, గాంభీర్యాన్ని తన హావభావాలతో పలికించి ఆ పాత్రకు చిరునామాగా నిలిచారు. 'మిస్సమ్మ', 'ఇల్లరికం', 'ఇలవేల్పు', 'లేత మనసులు', 'గుండమ్మ కథ', 'మూగ మనసులు' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలు ఆమె సినీ ప్రస్థానంలో మైలురాళ్లుగా నిలిచాయి. తెలుగు మాత్రమే కాకుండా తమిళం, హిందీతో పాటు పలు భాషల్లో నటించి సుమారు 200 చిత్రాలకు చేరువైన సినీ ప్రయాణాన్ని సాగించారు. తెలుగు 'మూగ మనసులు' హిందీ రూపాంతరమైన 'మిలన్'లోనూ ఆమె నటనకు విశేష గుర్తింపు దక్కింది. వెండితెరకే జమున జీవితం పరిమితం కాలేదు. సామాజిక సేవలోనూ చురుగ్గా వ్యవహరించారు. కళాకారుల సంక్షేమం కోసం సంస్థాగతంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందిరాగాంధీపై ఉన్న అభిమానంతో రాజకీయాల్లోకి వచ్చిన జమున కాంగ్రెస్‌లో చేరారు. 1989లో రాజమండ్రి లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికై పార్లమెంటులో అడుగుపెట్టారు. అనంతరం క్రియాశీల రాజకీయాలకు దూరమైన ఆమె కొంతకాలం తర్వాత భారతీయ జనతా పార్టీ తరఫున ప్రచారం చేశారు. సినీ రంగానికి చేసిన సేవలకు అనేక పురస్కారాలు ఆమెను వరించాయి. 'మిలన్' చిత్రానికి ఉత్తమ సహాయ నటిగా ఫిలింఫేర్ పురస్కారం అందుకున్నారు. తమిళనాడు ప్రభుత్వం నుంచి గౌరవ పురస్కారంతో పాటు ఎన్టీఆర్ జాతీయ పురస్కారాన్ని కూడా అందుకున్నారు. దాదాపు ఏడు దశాబ్దాల పాటు తెలుగు



సినీ ప్రేక్షకుల జ్ఞాపకాల్లో నిలిచిన జమున 2023 జనవరి 27న హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆమె భౌతికంగా దూరమైనా వెండితెరపై సృష్టించిన పాత్రలు మాత్రం సజీవంగానే ఉన్నాయి. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకుడు సత్యభామను తలచుకున్న ప్రతిసారీ జమున రూపమే కళ్లముందు కదలాడుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# మంధాన మరో మైలురాయి.. పరుగుల్లో నంబర్-2!

- సుజీ బేట్స్‌ను వెనక్కినెట్టిన భారత ఓపెనర్
- అంతర్జాతీయ క్రికెట్‌లో 10,756 పరుగులు
- అగ్రస్థానంలో మిథాలీ రాజ్
- మూడు ఫార్మాట్లలో మంధాన రికార్డుల జోరు
- వన్డేల్లోనూ వెయ్యి పరుగుల అరుదైన ఘనత




**దుబాయ్:** భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో మరో మైలురాయిని అందుకుంది. మూడు ఫార్మాట్లలో కలిపి అత్యధిక పరుగులు సాధించిన మహిళా క్రికెటర్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకుంది. మహిళల ఆసియా కప్‌లో థాయ్‌లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 19 పరుగులు చేసిన మంధాన..



న్యూజిలాండ్ దిగ్గజ క్రికెటర్ సుజీ బేట్స్‌ను వెనక్కినెట్టి ఈ ఘనత సాధించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో మంధాన ఖాతాలో ప్రస్తుతం 10,756 పరుగులు ఉన్నాయి. భారత మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ 10,868 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. మంధాన ఇప్పటివరకు 9 టెస్టుల్లో 788, 120 వన్డేల్లో 5,411, 172 టీ20ల్లో 4,557 పరుగులు సాధించింది. మూడు ఫార్మాట్లలో నిలకడగా రాణిస్తున్న మంధాన ఇటీవల లార్డ్స్ వేదికగా తన 300వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడింది. ఆ మ్యాచ్‌లో అర్ధశతకంతో మెరిసింది. చారిత్రక లార్డ్స్ మైదానంలో జరిగిన మహిళల టెస్టులో అర్ధశతకం నమోదు చేసి ప్రత్యేక గుర్తింపు సాధించింది.

### వన్డేల్లోనూ రికార్డుల మోత

వన్డేల్లో ఒక క్యాలెండర్ ఏడాదిలో వెయ్యికి పైగా పరుగులు సాధించి మంధాన మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. 18 ఇన్నింగ్స్‌ల్లో 59 సగటుతో 1,062 పరుగులు చేసి ఆస్ట్రేలియా దిగ్గజం బెలిండా క్లార్క్ పేరిట ఉన్న రికార్డును అధిగమించింది. క్లార్క్ 1997లో 970 పరుగులు సాధించగా.. దాదాపు 27 ఏళ్ల తర్వాత ఆ రికార్డును మంధాన తిరగరాసింది. ఒక క్యాలెండర్ ఏడాదిలో అత్యధిక వన్డే పరుగులు చేసిన మహిళల జాబితాలో మంధాన అగ్రస్థానంలో నిలవగా.. దక్షిణాఫ్రికా స్టార్ లారా వోల్వార్డ్ 882 పరుగులతో తర్వాతి స్థానాల్లో నిలిచింది. న్యూజిలాండ్‌కు చెందిన డెబ్బీ హాక్లీ 880, అమీ సాటర్త్‌వైట్ 853 పరుగులతో ఈ జాబితాలో చోటు సంపాదించారు. బ్యాటింగ్‌లో నిలకడగా రాణిస్తూ ఒక్కో రికార్డును తన ఖాతాలో వేసుకుంటున్న మంధాన.. ఇప్పుడు అంతర్జాతీయ పరుగుల్లో మిథాలీ రాజ్ రికార్డుకు మరింత చేరువైంది.



# వీనస్‌కు బిగ్ షాక్

## వరుసగా 15వ ఓటమి!

- యూఎస్ ఓపెన్ తొలిరౌండ్‌లోనే ఇంటిముఖం
- సోఫియా కెనిన్ చేతిలో వరుస సెట్లలో పరాజయం
- 46 ఏళ్ల వయసులో వైల్డ్‌కార్డ్‌తో బరిలోకి
- మెగా టోర్నీలో రికార్డు ప్రదర్శనకు నిరాశాజనక ముగింపు
- సింగిల్స్‌లో కొనసాగుతున్న ఓటముల పరంపర

**న్యూయార్క్:** ఒకప్పుడు మహిళల టెన్నిస్‌ను శాసించిన అమెరికా దిగ్గజం వీనస్ విలియమ్స్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. యూఎస్ ఓపెన్--2026లో వైల్డ్‌కార్డ్‌తో బరిలోకి దిగిన 46 ఏళ్ల వీనస్ తొలి రౌండ్‌లోనే పరాజయం పాలైంది. అమెరికాకే చెందిన సోఫియా కెనిన్ చేతిలో వరుస సెట్లలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. దీంతో సింగిల్స్‌లో వీనస్‌కు ఇది వరుసగా 15వ ఓటమిగా నమోదైంది. ఇటీవల సిన్సినాటి ఓపెన్‌లోనూ ఆశించిన ఫలితం అందుకోలేకపోయిన వీనస్.. సొంతగడ్డపై జరుగుతున్న యూఎస్ ఓపెన్‌లోనైనా సత్తా చాటాలని భావించింది. అయితే తొలి రౌండ్‌లోనే కెనిన్ ఆమె ఆశలకు చెక్ పెట్టింది. తొలి సెట్‌లో వీనస్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన కెనిన్ 6-2తో సెట్‌ను సొంతం చేసుకుంది. రెండో సెట్‌లో వీనస్ గట్టిగా పోరాడినా కీలక సమయంలో కెనిన్ పైచేయి సాధించి మ్యాచ్‌ను ముగించింది. దీంతో కెనిన్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించగా.. వీనస్ సింగిల్స్ ప్రయాణం తొలి రౌండ్‌లోనే ముగిసింది. సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో చిరస్మరణీయ విజయాలు సాధించిన వీనస్.. వయసును సైతం లెక్కచేయకుండా టెన్నిస్ కోర్టులో కొనసాగుతుండటం విశేషం. అయితే ఇటీవలి కాలంలో సింగిల్స్‌లో విజయాలు ఆమెకు దూరమవుతున్నాయి. తాజా పరాజయంతో వరుస ఓటముల సంఖ్య 15కు చేరింది. ఒకప్పుడు ప్రత్యర్థులకు చెమటలు పట్టించిన వీనస్.. ఇప్పుడు ఒక్క విజయం కోసం సుదీర్ఘంగా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.


SOFIA KENIN

# హాకీ వరల్డ్ కప్ 2026 విజేత జర్మనీ

- స్పెయిన్‌పై 1-0తో విజయం!
- వరుసగా రెండో ప్రపంచకప్ టైటిల్
- నాలుగోసారి విశ్వవిజేతగా జర్మనీ
- పాకిస్థాన్ రికార్డు సమం
- అర్జెంటీనాకు కాంస్య పతకం



**వావ్రే, ఆగస్టు 30:** పురుషుల హాకీ ప్రపంచకప్--2026లో జర్మనీ విశ్వవిజేతగా నిలిచింది. బెల్జియంలోని వావ్రేలో ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో స్పెయిన్‌ను 1-0 గోల్ తేడాతో ఓడించి టైటిల్‌ను నిలబెట్టుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన జర్మనీ మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుతూ వరుసగా రెండో ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో తొలి రెండు క్వార్టర్లలో ఇరు జట్లు గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. స్పెయిన్ ఎక్కువసేపు బంతిని తన ఆధీనంలో ఉంచుకోవడంతో పాటు పెనాల్టీ కార్నర్లు సంపాదించినా.. జర్మనీ పటిష్టమైన డిఫెన్స్‌ను ఛేదించలేకపోయింది.

### ఒక్క గోల్.. కప్ సొంతం

మూడో క్వార్టర్ చివర్లో మ్యాచ్ మలుపు తిరిగింది. 44వ నిమిషంలో జర్మనీకి లభించిన అవకాశాన్ని మైకేల్ స్ట్రుతాఫ్ గోల్‌గా మలచడంతో ఆ జట్టు 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత స్పెయిన్ సమం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించినా జర్మనీ రక్షణ గోడను దాటలేకపోయింది. మ్యాచ్ ముగియడానికి నాలుగు నిమిషాల కంటే తక్కువ సమయం ఉండగా స్పెయిన్ గోల్‌కీపర్‌ను వెనక్కి తీసుకుని అదనపు అవుట్‌ఫీల్డ్ ఆటగాడిని రంగంలోకి దించింది. చివరి నిమిషాల్లో వరుస దాడులు చేసినా గోల్ మాత్రం దక్కలేదు. చివరి హూటర్ మోగేసరికి 1-0 ఆధిక్యాన్ని నిలబెట్టుకున్న జర్మనీ ప్రపంచకప్‌ను ముద్దాడింది.

### నాలుగోసారి విశ్వవిజేత

ఈ విజయంతో జర్మనీ నాలుగోసారి పురుషుల హాకీ ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. గతంలో 2002, 2006, 2023లో టైటిళ్లు సాధించిన జర్మనీ.. 2026లో మరోసారి విజేతగా నిలిచి పాకిస్థాన్ పేరిట ఉన్న నాలుగు ప్రపంచకప్‌ల రికార్డును సమం చేసింది. పాకిస్థాన్ 1971, 1978, 1982, 1994లో విశ్వవిజేతగా నిలిచింది. మరోవైపు స్పెయిన్‌కు మూడో ప్రపంచకప్ ఫైనల్లోనూ నిరాశే ఎదురైంది. 1971, 1998లో రన్నరప్‌గా నిలిచిన ఆ జట్టు.. ఈసారి కూడా టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచిపోయింది. ఫైనల్లో లభించిన నాలుగు పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలచుకోలేకపోవడం స్పెయిన్‌ను దెబ్బతీసింది. విజయం అనంతరం గోల్ హీరో మైకేల్ స్ట్రుతాఫ్ మాట్లాడుతూ జట్టు ప్రదర్శన పట్ల గర్వంగా ఉందని పేర్కొన్నాడు. యువ ఆటగాళ్లతో కూడిన తమ జట్టు సమష్టిగా పోరాడిందని తెలిపాడు. జర్మనీ కెప్టెన్ టామ్ గ్రాంబుష్ తమ తదుపరి లక్ష్యం లాస్ ఏంజెల్స్--2028 ఒలింపిక్స్ అని స్పష్టం చేశాడు.

### అర్జెంటీనాకు కాంస్యం

మూడో స్థానం కోసం జరిగిన పోరులో అర్జెంటీనా 2-1 గోల్స్ తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. ఈ ప్రపంచకప్‌లో మొత్తం 16 జట్లు తలపడగా 50 మ్యాచ్‌లు జరిగాయి. మొత్తం 248 గోల్స్ నమోదయ్యాయి. వాటిలో 136 ఫీల్డ్ గోల్స్, 97 పెనాల్టీ కార్నర్ గోల్స్, 15 పెనాల్టీ స్ట్రోక్ గోల్స్ ఉన్నాయి.

ఒక్క గోల్‌తో ఫైనల్‌ను శాసించిన జర్మనీ.. వరుసగా రెండోసారి కప్పును ముద్దాడి ప్రపంచ హాకీలో తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది.



# ఫుట్‌బాల్‌కు మెస్సీ వీడ్కోలు..!

**బ్యూనస్ ఎయిర్స్, ఆగస్టు 31:** ప్రపంచంలోని ఫుట్‌బాల్ అభిమానులకు షాకింగ్ న్యూస్. అర్జెంటీనా స్టార్ లియోనల్ మెస్సీ వీడ్కోలు పలికాడు. తన ఆటతో కోట్లాదిమందిని మంత్రముగ్ధులను చేసిన ఈ దిగ్గజం సోమవారం అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు అల్విదా చెప్పేశాడు. ఇటీవలే తన తండ్రి మరణాంతరం మైదానంలోకి దిగిన ఈ ఫార్వర్డ్ ప్లేయర్ హఠాత్తుగా సంచలన నిర్ణయంతో అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ప్రపంచ సాకర్‌లో ఓ శకం ముగిసింది. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా తన ఆటతో అభిమానులను ఉర్రూతలూగించిన లియోనల్ మెస్సీ వీడ్కోలు పలికాడు. అర్జెంటీనా దిగ్గజ ఆటగాడిగా, వరల్డ్‌కప్ సాధించిన కెప్టెన్‌గా అతడు తన సుదీర్ఘ కెరీర్‌ను ముగించాడు. నాలుగేళ్ల క్రితం ఖతార్‌లో తన కెప్టెన్సీలో అర్జెంటీనాను ఫిఫా వరల్డ్‌కప్ విజేతగా నిలిపిన మెస్సీ.. ఈసారి కూడా గట్టిగానే ప్రయత్నించాడు. కానీ, ఫైనల్లో స్పెయిన్ కప్‌ను ఎగరేసుకుపోయింది. తన రిటైర్మెంట్ వార్తను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించాడీ మెస్సీ. జులై 20న ఫిఫా ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓటమి అనంతరం వీడ్కోలుపై ఆలోచించిన మెస్సీ ఎట్టకేలకు సోమవారం తన నిర్ణయాన్ని ప్రకటించాడు. 'ఫిఫా వలర్డ్‌కప్ ఫైనల్ ముగిసినప్పటి నుంచి వీడ్కోలు గురించి ఆలోచిస్తున్నా. అర్జెంటీనా ఫుట్‌బాల్ నుంచి నేను రిటైరవుతున్నాని ప్రతి ఒక్కరికి తెలియజేస్తున్నా. ఈ నిర్ణయం నన్నెంతగానో బాధిస్తోంది. అయినా సరే ఇదే సరైన సమయం అనిపించింది' అని మెస్సీ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో మూడు పేజీల లేఖను పోస్ట్ చేశాడీ వెటరన్. 'అర్జెంటీనా ఫుట్‌బాల్ కోసం నేను సర్వం ధారపోశాను. గత కొన్ని ఏళ్లు సాధిస్తున్న విజయాలకు ముందు నుంచీ నేను ఎంతో చేశా. అర్జెంటీనా అభిమానులుగా మీరు సంతోషపడేందుకు, గర్వపడేందుకు తెలుపు, నీలం రంగు జెర్సీకోసం నేను ఎంతో పోరాడాను. అయితే.. ఇప్పుడు మరింత సమయం లేదు. విభిన్నమైన అధ్యాయాలు ముగియనున్నాయి. ఈ విషయం నన్ను చాలా బాధిస్తోంది. జాతీయ జట్టుకు ఆడడాన్ని నేను ఎంతో ఇష్టపడ్డాను. ఎల్లప్పుడూ ఇష్టపడతాను కూడా. ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లు నా స్థానంలో రాబోతున్నారు'అని పేర్కొన్న మెస్సీ.. ఇకపై క్లబ్స్ తరఫున మైదానంలో ఫ్యాన్స్‌ను అలరించనున్నాడు. ప్రస్తుతానికి ఇంటర్ మియామికి ఆడుతున్న మెస్సీ తనను ఎంతో ప్రేమించి, మద్దతుగా నిలిచిన అర్జెంటీనా అభిమానులకు ధన్యవాదాలు తెలిపాడు.



# క్యాన్సర్ పుకార్లను తోసిపుచ్చిన నటి ప్రేమ

## సరైన జోడీ కుదిరితే రెండో పెళ్లికి ఓకే

దక్షిణాది సినీ పరిశ్రమలో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన సీనియర్ నటి ప్రేమ.. తన వ్యక్తిగత జీవితంపై వచ్చిన పలు రూమర్లకు తాజాగా చెక్ పెట్టారు. ముఖ్యంగా తనకు క్యాన్సర్ వచ్చిందంటూ గతంలో జరిగిన ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో తన రెండో వివాహంపై వస్తున్న వార్తలపైనా ఆమె ఆసక్తికరంగా స్పందించారు. జీవితాంతం తనకు తోడుగా ఉండే సరైన వ్యక్తి దొరికితే వయసుతో సంబంధం లేకుండా పెళ్లి చేసుకోవడానికి సిద్ధమేనని ఆమె పేర్కొన్నారు. కాగా, తెలుగు, కన్నడ చిత్ర పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రేమ.. వెంకటేష్ సరసన నటించిన 'ధర్మచక్రం', కోడి రామకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన 'దేవి' వంటి సినిమాల తో తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. గతంలో తనకు క్యాన్సర్ సోకిందంటూ కొన్ని వార్తలు ప్రచారంలోకి రావడంపై ప్రేమ తీవ్రంగా స్పందించారు. తాను న్యూజిలాండ్‌కు స్నేహితురాలిని కలవడానికి వెళ్లిన సమయంలో ఈ పుకార్లు వ్యాపించాయని తెలిపారు.క్యాన్సర్‌తో పోరాడి విజయం సాధించిన సోనాలి బింద్రే, మమతా మోహన్‌దాస్, గౌతమి వంటి నటీమణులను ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే తనకు మాత్రం అలాంటి అనారోగ్య సమస్య ఏదీ లేదని స్పష్టం చేశారు. దేవుడి దయతో తాను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నానని తెలిపారు. తన గురించి ఇలాంటి తప్పుడు వార్తలు రావడం బాధ కలిగించిందని చెప్పిన ప్రేమ.. ఆ సమయంలో తల్లిదండ్రుల అండ తనకు ఎంతో మానసిక బలాన్ని ఇచ్చిందని వెల్లడించారు. ప్రేమ వ్యక్తిగత జీవితంలో 2006లో వ్యాపారవేత్త జీవన్ అప్పాచ్చును వివాహం చేసుకున్నారు. అయితే కుటుంబ విభేదాల కారణంగా 2016లో వీరిద్దరూ చట్టబద్ధంగా విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి ప్రేమ ఒంటరిగా ఉంటున్నారు. ఇటీవల ఆమె రెండో పెళ్లి చేసుకోబోతు న్నారంటూ వార్తలు రావడంతో ఈ అంశంపై కూడా ఆమె స్పందించారు. పెళ్లి అనేది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం చేశారు.

# షూటింగ్ సెట్‌లోకి అడుగుపెట్టిన రష్మిక

షూటింగ్‌లో గాయపడిన నటి రష్మిక కోలుకున్నారు. తిరిగి సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఇంట్లో విశ్రాంతి తీసుకున్న రోజులను గుర్తుచేసుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు. 'తిరిగి షూట్‌కు వెళ్తున్నా. కానీ, ఈ క్షణాలను మాత్రం కచ్చితంగా మిస్ అవుతాను' అంటూ వరలక్ష్మి వ్రతం చేస్తోన్న ఫొటోలతో పాటు.. ఇంట్లో తాను ఆడుకున్న పజిల్ చిత్రాలను షేర్ చేశారు. ఎట్టకేలకు రష్మిక తిరిగి సెట్‌లోకి వెళ్లడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఆమెకు జాగ్రత్తలు చెబుతూ.. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అంటూ నెట్టింట కామెంట్స్ చేస్తున్నారు. 'మైసా' చిత్రీకరణ సమయంలో రష్మిక గాయపడ్డారు. షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా తుంటి భాగంలో బలమైన గాయమైంది. ఆరు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో రష్మిక ఇంట్లో ఉండి తరచూ తన హెల్త్ అప్‌డేట్‌లతో పాటు, తాను చేస్తోన్న పనులను అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నారు.






# 'హతః' టైటిల్‌తో కిరణ్ అబ్బవరం కొత్త సినిమా



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ తనదైన ముద్ర వేయడానికి సిద్ధమవుతున్నారు. ఇటీవల 'తిమ్మరాజుపల్లి టీవీ' చిత్రంతో నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన ఆయన, పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్న తన రెండో ప్రాజెక్ట్‌కు 'హతః' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌ను మేకర్స్ చాలా విభిన్నంగా రూపొందించారు. చీకటి వాతావరణంలో ఒక డార్క్ బాక్స్‌లో ఉన్న పిల్లిని చూపిస్తూ, "ఈజ్ ద క్యాట్ అలైవ్ ఆర్..." (×ర్ ష్ట్రవ ఝ్ ఖశ్రీఱజవ శీతీ...) అనే సస్పెన్స్ క్యాప్షన్‌తో టైటిల్‌ను రివీల్ చేశారు. పిల్లి బతికే ఉందా లేదా అనే ప్రశ్నతో ప్రేక్షకుల్లో తీవ్ర క్యూరియాసిటీని పెంచే ప్రయత్నం చేశారు. ఇప్పటివరకు చూడని విభిన్నమైన కథాంశంతో, కొత్త జానర్‌లో ఈ సినిమా రూపొందుతున్నట్లు సమాచారం. ఈ చిత్రానికి అనుష్ గోరాక్ రచన, దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారు. కుష్లు మద్దాల, రెహ్మాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టస్వామి తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తుండగా, జెసిన్ జార్జ్ సంగీతాన్ని, అఖిల్ చక్రవర్తి ఎడిటింగ్ బాధ్యతలను అందిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ త్వరలోనే వెల్లడించనున్నారు.

# విడుదలకు రెడీ అవుతున్న సర్దార్-2




కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'సర్దార్ 2' ఒకటి. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా.. గతంలో ప్రేక్షకులను ఆకట్టుకున్న 'సర్దార్' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతోంది. మొదటి భాగంలో ఏజెంట్‌గా కార్తీ చేసిన యాక్షన్, డిఫరెంట్ గెటప్‌లు ప్రేక్షకులను మెప్పించడంతో.. సీక్వెల్‌పై కూడా మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజాగా 'సర్దార్ 2'కు సంబంధించి మేకర్స్ కీలక అప్డేట్ ఇచ్చారు. సినిమా తెలుగు వెర్షన్‌కు సంబంధించిన ట్రైలర్, ఆడియోను విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. దీంతో కార్తీ అభిమానుల్లో సందడి మొదలైంది. 'సర్దార్ 2'పై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి ఉంది. ఇప్పుడు తెలుగు ట్రైలర్ విడుదల కానుండటంతో సినిమాకు సంబంధించిన కథ, కార్తీ పాత్ర, యాక్షన్ సన్నివేశాలు, విలన్ క్యారెక్టర్‌పై మరింత క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.ముఖ్యంగా మొదటి భాగంలో కార్తీ ఏజెంట్ పాత్రకు మంచి స్పందన రావడంతో.. రెండో భాగంలో ఆ పాత్రను దర్శకుడు ఏ స్థాయిలో చూపించారనే విషయంపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ట్రైలర్ విడుదల తర్వాత సినిమాపై బజ్ మరింత పెరుగుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. 'సర్దార్'లో కార్తీ విభిన్న గెటప్‌లలో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ముఖ్యంగా ఏజెంట్ పాత్ర సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పుడు అదే పాత్రను కొనసాగిస్తూ 'సర్దార్ 2'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. సీక్వెల్‌లో కథ మరింత విస్తృతంగా ఉండబోతుందని, యాక్షన్‌తో పాటు స్పై థ్రిల్లర్ అంశాలకు ప్రాధాన్యత ఉంటుందని తెలుస్తోంది. మొదటి భాగంతో పోలిస్తే రెండో భాగాన్ని మరింత భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు చిత్ర బృందం చెబుతోంది. ఈ సినిమాలో విలన్ పాత్రలో విలక్షణ నటుడు ఎస్‌జే సూర్య నటిస్తున్నారు. ఆయనకు ఉన్న ప్రత్యేకమైన నటన శైలికి తగ్గట్టుగా పవర్‌ఫుల్ క్యారెక్టర్‌ను డిజైన్ చేసినట్లు సమాచారం.కార్తీ, ఎస్‌జే సూర్య మధ్య జరిగే పోరాటం సినిమాకు కీలకంగా ఉండబోతుందని టాక్. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ట్రైలర్‌లో విలన్ పాత్రను ఎంతవరకు రివీల్ చేస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.'సర్దార్ 2'లో మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కార్తీతో ఆమె కాంబినేషన్ సినిమాకు మరో ఆకర్షణగా నిలవనుంది. యాక్షన్, థ్రిల్లర్ అంశాలతో పాటు సినిమాలో ఎమోషనల్, కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా ఉండనున్నట్లు తెలుస్తోంది. 'సర్దార్ 2' చిత్రాన్ని 2026 సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# శ్రీవిష్ణు కొత్త మూవీ ప్రారంభం

వైవిధ్యమైన కథలు, వినోదాత్మక చిత్రాలతో ప్రేక్షకులను అలరించే కథానాయకుడు శ్రీవిష్ణు. ఇప్పుడాయన మరో ఆసక్తికరమైన కథను ప్రేక్షకులకు అందించేందుకు సిద్ధమయ్యారు. సన్నీ సంజయ్ దర్శకత్వంలో శ్రీవిష్ణు నటిస్తున్న కొత్త సినిమా ప్రకటన వచ్చింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై హారిక సూర్యదేవర నిర్మిస్తున్న కొత్త మూవీ షూటింగ్ సోమవారం మొదలైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం గ్లింప్స్‌ను పంచుకుంది. 'ఇది మనందరి కథ. అందిలాగే నా కథ' అంటూ శ్రీ విష్ణు తన కథను చెబుతున్న విధానం అలరిస్తోంది. 'మరుగేలరా.. ఓ రాఘవ' అంటూ నేపథ్యంలో త్యాగరాజ కృతి వినిపించారు.




This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com